




Truth of News

RNI NO : APTEL/25/A0239

# సూర్య వాస్తవం

http://www.suryavastavam.in

చీఫ్ ఎడిటర్: మొఘల్ ఇర్షాద్ బేగ్



IRS PUBLICATIONS

irspublications12@gmail.com



సంపుటి: 01 | అన్నమయ్య జిల్లా | సంచిక : 283 | మంగళవారం 28 ఏప్రిల్ 2026 | పేజీలు : 8 | వెల రూ.6.50

Circulated from Hyderabad, Vishakapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Anantapuram, kadapa, kurnool, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bengalore, Mumbai, New Delhi


# మే 4న బెంగాల్‌లో మిఠాయిలు పంచుతాం

- ప్రధాని నరేంద్రమోదీ
- బీజేపీ సీఎం ప్రమాణ స్వీకారానికి తాను బెంగాల్ వస్తానన్న మోదీ
- దేశ ప్రజలే తన కుటుంబమని వెల్లడి
- టీఎంసీ హయాంలో నేరస్థులు స్వేచ్ఛగా తిరుగుతున్నారని విమర్శలు



అమరావతి - సూర్య వాస్తవం

మే 4న ఎన్నికల ఫలితాలు వెలువడిన తర్వాత రాష్ట్రమంతా మిఠాయిలు పంచుతామని ప్రధానమంత్రి నరేంద్రమోదీ అన్నారు. పశ్చిమ బెంగాల్‌లో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. బీజేపీ ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకారానికి తాను తిరిగి బెంగాల్ వస్తానని చెప్పారు. ఎన్నికల ప్రచారంలో నేడు బారక్‌పూర్‌లో ఏర్పాటు చేసిన చివరి ర్యాలీలో మాట్లాడుతూ, బీజేపీ అధికారంలోకి వస్తుందనే ఉత్సాహంతో తాను ఢిల్లీకి వెళుతున్నానని అన్నారు. తాను హెలిప్యాడ్ దిగి వస్తుంటే దాదాపు 2 కిలోమీటర్ల మేర ప్రజలు ఎదురుచూస్తూ ఉన్నారని తెలిపారు. తనను ఆశీర్వదించడానికి ఇంతమంది ప్రజలు వస్తారని ఊహించలేదని అన్నారు. రాజకీయాల్లోకి వచ్చి

- మిగతా 2లో..



## బీజేపీలో ఆప్ ఎంపీల విలీనానికి రాజ్యసభ ఆమోదం

- బీజేపీలో చేరిన ఏడుగురు ఆప్ రాజ్యసభ సభ్యులు
- బీజేపీ పార్లమెంటరీ పార్టీలో విలీనం
- ఈ విలీనాన్ని రాజ్యసభ చైర్మన్ ఆమోదించారన్న కిరణ్ రిజిజు

అమరావతి - సూర్య వాస్తవం

జాతీయ రాజకీయాల్లో పెను సంచలనం నమోదైంది. ఆమ్ ఆద్మీ పార్టీకి చెందిన ఏడుగురు రాజ్యసభ సభ్యులు అధికారికంగా బీజేపీ పార్లమెంటరీ పార్టీలో విలీనమయ్యారు. ఈ మేరకు రాజ్యసభ చైర్మన్ ఈ విలీనాన్ని ఆమోదించినట్లు

- మిగతా 2లో..



## కాంగ్రెస్ పార్టీలో చేరడం రిస్కీ పని

- యువతి సమాధానంతో రాహుల్ గాంధీ నవ్వులు
- ఢిల్లీ యూనివర్సిటీ విద్యార్థినులతో ముచ్చట్లు
- యువతి సమాధానానికి సరదాగా నవ్విన రాహుల్ గాంధీ
- అవును.. నిజంగానే రిస్క్ అన్న రాహుల్ గాంధీ

అమరావతి- సూర్య వాస్తవం

మీ జీవితంలో మీరు చేసిన అత్యంత రిస్కీ పని ఏమిటి? అని కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ ప్రశ్నించగా, ఓ విద్యార్థిని నుంచి ఊహించని సమాధానం వచ్చింది. దీనితో అక్కడ కొన్ని క్షణాలు నవ్వులు విరబూశాయి. ఇందుకు సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాలో వెరల్‌గా మారింది. ఢిల్లీ యూనివర్సిటీ,

- మిగతా 2లో..



## విజయం కన్నా ఓటమే గొప్ప పాఠం నేర్పుతుంది

- ఏయూ శతాబ్ది వేడుకల్లో ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్
- ఆంధ్రా యూనివర్సిటీ శతాబ్ది వేడుకల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఉపరాష్ట్రపతి
- అంతర్గత ఒత్తిడిని జయించడంపై విద్యార్థులకు కీలక సందేశం
- విజయం కంటే ఓటమి నుంచే ఎక్కువ నేర్చుకోవచ్చని వ్యాఖ్య
- ఏపీ అభివృద్ధి ప్రయాణాన్ని, సీఎం చంద్రబాబు నాయకత్వాన్ని ప్రశంసించిన ఉపరాష్ట్రపతి
- ప్రపంచస్థాయి విశ్వవిద్యాలయంగా ఎదగాలని ఆకాంక్ష


అమరావతి- సూర్య వాస్తవం

విజయం సాధించాలంటే ముందు మన అంతర్గత ఒత్తిడిని జయించాలని, అప్పుడే లక్ష్యాన్ని చేరుకోగలమని భారత ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ విద్యార్థులకు పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరిలో ఉండే అంతర్గత ఒత్తిడిని అధిగమించగలిగితేనే ఏ రంగంలోనైనా రాణించగలమని స్పష్టం చేశారు. విశాఖపట్నంలోని ఆంధ్రా యూనివర్సిటీ (ఏయూ)

- మిగతా 2లో..

# పెట్రోల్, డీజిల్ కొరతపై నిరంతర పర్యవేక్షణ...

- ఏపీలో మెరుగుపడుతున్న పరిస్థితులు
- ఆయిల్ కంపెనీ ప్రతినిధులతో అధికారుల వరుస సమావేశాలు
- క్షేత్రస్థాయి పరిస్థితులను ఎప్పటికప్పుడు సీఎంకు నివేదించిన అధికారులు
- 11,909 కిలోలీటర్ల పెట్రోల్, 19,707 కిలోలీటర్ల డీజిల్ సరఫరా చేసిన ఆయిల్ కంపెనీలు
- రాత్రిళ్లు కూడా లోడ్ డిస్పాచ్ జరపాలని ముఖ్యమంత్రి ఆదేశం
- సాధారణ పరిస్థితులు నెలకొనేంత వరకు ఆర్టీజీఎస్ నుంచి నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశం



అమరావతి - సూర్య వాస్తవం

రాష్ట్రంలో ఏర్పడిన పెట్రోల్, డీజిల్ కొరతపై నిరంతరం పర్యవేక్షిస్తూనే ఉండాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. సోమవారం ఉదయం టెలికాన్ఫరెన్స్ నిర్వహించిన ముఖ్యమంత్రి, విశాఖకు బయలుదేరే ముందు మరోసారి పరిస్థితిపై సమీక్షించారు. అలాగే విశాఖ నుంచి మరోసారి టెలి కాన్ఫరెన్స్ చేపట్టారు. రాష్ట్రంలో పెట్రోల్, డీజిల్ సమస్య సాధారణస్థితికి చేరుకునేంత వరకు ఎవ్వరూ విశ్రమించవద్దని, ఆర్టీజీఎస్ నుంచి నిరంతరం పర్యవేక్షిస్తూనే ఉండాలని స్పష్టం చేశారు. ఆయిల్ కంపెనీలతో సంప్రదింపులు జరుపుతూ, క్షేత్రస్థాయిలో ఉన్న పరిస్థితిని ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ ఉండాలని ఆదేశించారు. సోమవారం మొత్తంగా 2,679 లోడ్లను రాష్ట్రంలోని వివిధ పెట్రోల్ బంకులకు పంపాలని ప్రణాళికలు సిద్ధం చేస్తే వాటిల్లో 2,079 లోడ్లు ఇప్పటికే బయలుదేరాయని, వీటిల్లో కొన్ని గమ్యస్థానాలకు చేరుకున్నట్లు అధికారులు వివరించారు. ఇక మిగిలిన మరో 600 లోడ్లను డిస్పాచ్ చేసేందుకు సిద్ధమవుతున్నట్లు తెలిపారు. ఈ 2,079 లోడ్లల్లో 11,909 కిలోలీటర్ల పెట్రోల్, 19,707 కిలోలీటర్ల డీజిల్ వివిధ బంకులకు వెళ్లాయని అన్నారు. రాష్ట్రంలోని మూడు ఆయిల్ సరఫరా కంపెనీలైన ఐఓసీఎల్, బీపీసీఎల్, హెచ్‌పీసీఎల్ సంస్థల ద్వారా ఈ మొత్తం లోడ్ డిస్పాచ్ అయిందని, ప్రతి లోడ్‌కు రెవెన్యూ, పోలీస్ సిబ్బందిని అటాచ్ చేసి

- మిగతా 2లో..

## బీఆర్ఎస్ ఓ 'చచ్చిన శవం'..

- కవిత పార్టీ అవసరమే లేదు - సీఎం రేవంత్ రెడ్డి
- చచ్చిన శవానికి ఎంత అలంకరణ చేసినా వేస్ట్
- రాష్ట్రంలో కొత్త పార్టీ అవసరమే లేదని వ్యాఖ్య
- బీఆర్ఎస్ ఉంటుందో, ఊడుతుందో అని ఎద్దేవా



అమరావతి- సూర్య వాస్తవం

కొత్త ఎమ్మెల్సీలుగా అజారుద్దీన్, కోదండరాం ప్రమాణస్వీకారం చేశారు. ప్రమాణస్వీకారం అనంతరం సీఎం రేవంత్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ... బీఆర్ఎస్ పార్టీపై విమర్శలు గుప్పించారు. బీఆర్ఎస్ పార్టీ చచ్చిపోయిందని ఆయన అన్నారు. "చనిపోయిన శవానికి ఎంత అలంకరణ

- మిగతా 2లో..

## మొక్కజొన్న రైతులకు పీడీపీ వర్తింపజేయాలి

- కేంద్రానికి సీఎం చంద్రబాబు లేఖ

## ఇంధన కొరత కృత్రిమం..

- దోపిడీ కోసమేనంటూ జగన్ ఫైర్
- కూటమి నేతలు, డీలర్లు కుమ్మక్కై దోపిడీకి పాల్పడుతున్నారని ఆరోపణ
- ధరల పెంపును ఆశించి డీలర్లు బ్లాక్ చేస్తున్నారని విమర్శ
- ఈ సంక్షోభంతో రైతులు, ఆక్వా రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని వ్యాఖ్య
- ప్రభుత్వం తీరు మార్చుకోకపోతే ప్రజలు గుణపాఠం చెబుతారని హెచ్చరిక

2లో




## ఇంధన కొరత ఏర్పడినందుకు చంద్రబాబు సిగ్గుపడాలి

- సమీక్షలు, సలహాలతో ఇంధన కొరత తీరదన్న షర్మిల
- రాష్ట్రంలో 70 శాతం బంకులు మూతపడ్డాయని వ్యాఖ్య
- కూటమి ప్రభుత్వ పాలనా వైఫల్యమని ఆరోపణ

అమరావతి- సూర్య వాస్తవం

రాష్ట్రంలో నెలకొన్న పెట్రోల్, డీజిల్ కొరతపై ఏపీ కాంగ్రెస్ చీఫ్ షర్మిల తీవ్రంగా స్పందించారు. కేవలం సమీక్షలు, సలహాలతో ఇంధన కొరత తీరదని, 24 గంటల డెడ్ లైన్‌తో ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాలని ఆమె డిమాండ్ చేశారు. రాష్ట్రంలో 70 శాతం బంకులు

- మిగతా 2లో..


సూర్య వాస్తవం దినపత్రికలోని మరిన్ని వార్తల కోసం సంప్రదించండి

Truth of News
సూర్య వాస్తవం
http://www.suryavastavam.in

మంగళవారం
28 ఏప్రిల్ 2026



# మే 4న బెంగాల్‌లో మిఠాయిలు పంచుతాం

(మొదటి పేజీ తరువాయి)
బీజేపీలో చేరిన తర్వాత ఒక కార్యకర్తగా పార్టీ ఏది చేయమన్నా అది చేశానని అన్నారు. తనకు ప్రత్యేకంగా ఒక కుటుంబం అంటూ లేదని, దేశ ప్రజలే తన కుటుంబమని వ్యాఖ్యానించారు. గత నాలుగు దశాబ్దాలుగా తాను దేశంలోని ప్రతి ప్రాంతంలో పర్యటిస్తున్నానని మోదీ అన్నారు. ఈ రోడ్డు షోలే తనకు పుణ్యయాత్రలని వ్యాఖ్యానించారు. నాడు టీఎంసీ అధికారంలోకి రావడానికి కారణమైన 'మా-మాటి-మనుష్' నినాదాన్ని వారు వదిలివేశారని ఆరోపించారు. ఎన్నికల ప్రచారం సమయంలో వారు ఒక్కసారి కూడా ఈ నినాదాన్ని ప్రస్తావించకపోవడం ఆశ్చర్యంగా ఉందని అన్నారు. ఆ పార్టీ నేతలు రాష్ట్రాభివృద్ధిని పక్కన పెట్టి దూషణలు, బెదిరింపు రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. టీఎంసీ పాలనలో మహిళలపై గతంలో ఎన్నడూ లేనివిధంగా దాడులు జరిగాయని మండిపడ్డారు. నేరస్థులు స్వేచ్ఛగా తిరుగుతున్నారని ఆరోపించారు. తాము అధికారంలోకి రాగానే నిందితులను వదిలిపెట్టేది లేదని ప్రధాని మోదీ అన్నారు.

# కాంగ్రెస్ పార్టీలో చేరడం రిస్కీ పని

(మొదటి పేజీ తరువాయి)
గార్గీ కాలేజీలకు చెందిన విద్యార్థినులతో రాహుల్ గాంధీ ముచ్చటించారు. ఆ సమయంలో "మీరు చేసిన అత్యంత సాహసోపేతమైన పని ఏమిటి?" అని విద్యార్థినులను రాహుల్ గాంధీ ప్రశ్నించారు. అక్కడున్న వారిలో ఒక విద్యార్థిని స్పందిస్తూ, కాంగ్రెస్ పార్టీలో చేరడం అత్యంత సాహసోపేతమైనదని పేర్కొన్నారు. ఈ సమాధానంతో రాహుల్ గాంధీ కూడా నవ్వేశారు. "అవును, అది నిజంగా సాహసోపేత మైనదే" అంటూ బదులిచ్చారు. దీంతో రాహుల్ గాంధీతో పాటు విద్యార్థినులందరూ సరదాగా నవ్వారు. రాహుల్ గాంధీ యువ ఓటర్లతో మమేకవ్వడానికి ప్రయత్నిస్తున్నారు. ఈ క్రమంలో కాలేజీ విద్యార్థినులతో జరిగిన కార్యక్రమంలో ఈ సరదా సంభాషణ జరిగింది.

# బీజేపీలో ఆప్ ఎంపీల విలీనానికి రాజ్యసభ ఆమోదం

(మొదటి పేజీ తరువాయి)
కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు సోషల్ మీడియా వేదికగా ప్రకటించారు. బీజేపీలో చేరిన ఏడుగురు ఎంపీలు ఎంతో క్రమశిక్షణ కలిగిన వారని, పార్లమెంటరీ నిబంధనలకు లోబడి పనిచేసే వారంటూ కిరణ్ రిజిజు కొనియాడారు. ప్రధాని మోదీ నాయకత్వంలో దేశ నిర్మాణంలో భాగస్వాములు కావాలని వారిని ఆహ్వానించిన మంత్రి, ఇదే సమయంలో విపక్షాల 'ఇండి' కూటమిపై విరుచుకుపడ్డారు. తుక్డే-తుక్డే ఇండి అలయన్స్‌కు గుడ్ బై చెప్పే సమయం వచ్చింది అంటూ రిజిజు చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు రాజకీయ వర్గాల్లో తీవ్ర దుమారం రేపుతున్నాయి.

# పెట్రోల్, డిజీల్ కొరతపై నిరంతర పర్యవేక్షణ...

(మొదటి పేజీ తరువాయి)
పంపుతున్నట్టు అధికారులు వెల్లడించారు. డిస్పాచ్ అయ్యే ప్రాంతం నుంచి దూరంగా ఉండే ప్రాంతాలకు లోడ్‌లు చేరడం కొంచెం ఆలస్యమవుతోందని అధికారులు వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్ లోడ్ డిస్పాచ్ రాత్రిపూట కూడా జరపాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఆదివారం నాటితో పోల్చుకుంటే సోమవారం ఆయిల్ సరఫరా మెరుగైంది. ఇక సోమవారం ఉదయంతో పోల్చుకుంటే, సాయంత్రానికి అనకాపల్లి, తూర్పు గోదావరి, గుంటూరు, కృష్ణా, బాపట్ల, పల్నాడు, నంద్యాల, అనంతపురం, మార్కాపురం వంటి జిల్లాల్లో బంకుల్లో పెట్రోల్, డీజిల్ లభ్యత మెరుగైంది. ఇక రాష్ట్రవ్యాప్తంగా సోమవారం రాత్రి ఏడు గంటల సమయానికి 6,511 కిలోలీటర్ల పెట్రోల్, 9,046 కిలోలీటర్ల మేర అమ్మకాలు జరిగాయి.

# బీఆర్ఎస్ ఓ 'చచ్చిన శవం'..

(మొదటి పేజీ తరువాయి)
చేసినా ప్రయోజనం ఉండదు.. బీఆర్ఎస్ పరిస్థితి కూడా ఇప్పుడు అలాగే ఉంది" అంటూ విరుచుకుపడ్డారు. పదేళ్ల అహంకార పూరిత పాలన వల్లే ప్రజలు ఆ పార్టీని తిరస్కరించారని, దాని మనుగడే ప్రశ్నార్థకమైందని వ్యాఖ్యానించారు. ఇదే క్రమంలో కల్వకుంట్ల కవిత ప్రకటించిన కొత్త పార్టీపై పరోక్షంగా సెటైర్లు వేస్తూ.. రాష్ట్రంలో కొత్త పార్టీ పెట్టాల్సిన అవసరమే లేదని, అసలు ఉన్న పార్టీయే (బీఆర్ఎస్) ఉంటుందో, ఊడుతుందో తెలియని స్థితిలో ఉందని ఎద్దేవా చేశారు. రాష్ట్ర రాజకీయాల్లో కొత్త పార్టీలకు ప్రజలు అవకాశం ఇవ్వరని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

# ఇంధన కొరత ఏర్పడినందుకు చంద్రబాబు సిగ్గుపడాలి

(మొదటి పేజీ తరువాయి)
మూతపడటం అత్యంత దారుణమని, దీనిని అత్యవసర పరిస్థితిగా గుర్తించి సరఫరాను పునరుద్ధరించాలని కోరారు. "దేశంలో ఎక్కడా లేని ఇంధన కొరత ఏపీలోనే ఏర్పడినందుకు చంద్రబాబు సిగ్గుపడాలి. ప్రజలను ఎర్రటి ఎండలో కిలోమీటర్ల మేర నిలబెట్టడం కూటమి పాలనా వైఫల్యానికి నిదర్శనం" అని షర్మిల మండిపడ్డారు. మోదీకి మద్దతు ఇచ్చి ప్రధాని పీఠంపై కూర్చోబెట్టినా రాష్ట్రానికి ఇంధన కష్టాలు రావడం బాధాకరమన్నారు. ఇంధన కొరత వల్ల నిత్యావసర వస్తువుల ధరలు పెరిగే ప్రమాదం ఉందని, ప్రభుత్వం వెంటనే నిద్రమత్తు వీడాలని హెచ్చరించారు.

# విజయం కన్నా ఓటమే గొప్ప పాఠం నేర్పుతుంది




(మొదటి పేజీ తరువాయి)
శతాబ్ది ఉత్సవాల ముగింపు వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్‌ను ఉదాహరణగా చూపుతూ ఆయన ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. "క్రికెట్ దేవుడిగా పిలిచే సచిన్ టెండూల్కర్ కూడా తన 100వ సెంచరీ చేయడానికి చాలా సమయం తీసుకున్నారు. ఆ సమయంలో ఆయన తీవ్రమైన ఒత్తిడిని ఎదుర్కొన్నారు. కానీ, ఓపికతో, పట్టుదలతో ఆ ఒత్తిడిని జయించి తన లక్ష్యాన్ని సాధించారు. జీవితంలో గెలుపోటములు సహజం. నిజానికి విజయం కంటే ఓటములే మనకు ఎక్కువ గుణపాఠాలు నేర్పుతాయి. కాబట్టి ఓటమికి భయపడకుండా, మరింత ధైర్యంతో ముందుకు సాగాలి" అని విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు.

ఆంధ్రా యూనివర్సిటీ వందేళ్ల చరిత్రను, దేశానికి అందించిన సేవలను ఉపరాష్ట్రపతి కొనియాడారు. ఈ విశ్వవిద్యాలయం వందేళ్లుగా ఎన్నో చారిత్రక ఘట్టాలకు సాక్ష్యంగా నిలిచిందని, ఎందరో మేధావులను దేశానికి అందించిందని గుర్తుచేశారు. ముఖ్యంగా ఈ యూనివర్సిటీ రెండో ఉపకులపతిగా పనిచేసి, ఆ తర్వాత భారత తొలి ఉపరాష్ట్రపతిగా, రెండో రాష్ట్రపతిగా సేవలందించిన డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ మేధోసంపత్తిని, నైతిక స్పష్టతను స్మరించుకున్నారు. విద్య ద్వారా మేధస్సుతో పాటు వ్యక్తిత్వాన్ని కూడా పెంపొందించాలన్న ఆయన ఆశయం నేటికీ ఆదర్శనీయమన్నారు. నోబెల్ బహుమతి గ్రహీత సర్ సీవీ రామన్, మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు వంటి ఎందరో ప్రముఖులు ఈ విశ్వవిద్యాలయ పూర్వ విద్యార్థులు కావడం గర్వకారణమన్నారు. శాంతిస్వరూప్ భట్నాగర్, పద్మవిభూషణ్, పద్మశ్రీ వంటి ఎన్నో పురస్కారాలు పొందిన మేధావులను అందించిన ఘనత ఏయూదని ప్రశంసించారు.

ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి ప్రయాణంపై కూడా ఉపరాష్ట్రపతి ప్రశంసలు కురిపించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు దార్శనిక నాయకత్వంలో రాష్ట్రం వేగంగా అభివృద్ధి పథంలో పయనిస్తోందని అన్నారు. గూగుల్ వంటి అంతర్జాతీయ సంస్థలు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడం, ఆంధ్రప్రదేశ్ సామర్థ్యంపై పెరుగుతున్న విశ్వాసానికి నిదర్శనమని పేర్కొన్నారు. అమరావతిని శాశ్వత రాజధానిగా ప్రకటించే బిల్లు పార్లమెంటులో ఆమోదం పొందినప్పుడు తాను రాజ్యసభకు అధ్యక్షత వహించానని, ఆ క్షణంలో ఏపీ ప్రజల ముఖాల్లో ఆనందాన్ని చూశానని గుర్తు చేసుకున్నారు. ప్రధాని నరేంద్ర మోదీ ఆకాంక్షిస్తున్న "వికసిత భారత్" నిర్మాణానికి "వికసిత ఆంధ్రప్రదేశ్" దోహదపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. విద్యార్థులు సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ప్రతిభను సరైన మార్గంలో ఉపయోగిస్తేనే గొప్ప విజయాలు సాధ్యమవుతాయని సూచించారు. భవిష్యత్తులో ఆంధ్రా యూనివర్సిటీ జాతీయంగానే కాకుండా, అంతర్జాతీయ పటంలోనూ ఒక అగ్రగామి విశ్వవిద్యాలయంగా వెలుగొందాలని తన ఆకాంక్షను వ్యక్తం చేశారు.

# మొక్కజొన్న రైతులకు పీడీపీ వర్తింపజేయాలి

## - కేంద్రానికి సీఎం చంద్రబాబు లేఖ

**అమరావతి - సూర్య వాస్తవం**

రాష్ట్రంలోని మొక్కజొన్న రైతులను వ్యత్యాస ధర చెల్లింపు పథకం (పిడిపి) వర్తింపజేసి ఆదుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కోరారు. ఈ మేరకు కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు సోమవారం ఆయన లేఖ రాశారు. ప్రస్తుత రబీ సీజన్‌లో పండించిన మొక్కజొన్న పంటను కొనుగోలు చేయాలని, రైతులను ఆదుకునే చర్యలు వెంటనే చేపట్టాలని కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో మొక్కజొన్న సాగు చేసిన రైతులు ప్రస్తుతం తీవ్ర ఆందోళనలో ఉన్నారని లేఖలో పేర్కొన్నారు. మార్కెట్‌లో ధరలు రోజురోజుకూ పడిపోతుండగా, ప్రస్తుతం క్వింటాల్ ధర రూ.1,600 నుంచి 1,700 మధ్య మాత్రమే ఉందని వెల్లడించారు. ఇది కనీస మద్దతు ధర (ఎంఎస్‌పి) రూ.2,400 కంటే గణనీయంగా తక్కువగా ఉందని తెలిపారు. ఈ సీజన్‌లో రాష్ట్రంలో సుమారు 42.06 లక్షల టన్నుల మొక్కజొన్న దిగుబడి వచ్చే అవకాశం ఉందని, ఇంకా 14.26 లక్షల టన్నుల పంట కోత దశలో ఉందని పేర్కొన్నారు. సకాలంలో ప్రభుత్వం జోక్యం చేసుకోకపోతే రైతులు తీవ్ర నష్టాలు చవిచూడాల్సి వస్తుందని ముఖ్యమంత్రి వెల్లడించారు. మొక్కజొన్న కొనుగోలుకు కేంద్రం నుంచి మద్దతు లేకపోవడం వల్ల రాష్ట్రంపై అదనపు ఆర్థిక భారం పడుతుందని తెలిపారు. అందువల్ల ప్రధాన మంత్రి అన్నదాత ఆరు సంరక్షణ అభియాన్ (పిఎం- ఆశా) పథకంలో రైతులకు ధరల వ్యత్యాసాన్ని నేరుగా చెల్లించాలని కోరారు. రాష్ట్ర పరిస్థితిని ప్రత్యేకంగా పరిగణించి ధరల వ్యత్యాసంలో నూరు శాతం నిధులను కేంద్రమే భరించాలని, ఈ పథకాన్ని జూన్ 2026 వరకు పొడిగించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే నాఫెడ్, ఎపి మార్క్ ఫెడ్ సమన్వయంతో ఈ పథకాన్ని అమలు చేసేందుకు తక్షణ అనుమతులివ్వాలని కోరారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని కేంద్రం త్వరితగతిన స్పందించాలని ముఖ్యమంత్రి తన లేఖలో కోరారు.

# పర్యావరణహిత విద్యుత్‌పై దృష్టి

## - యూనిట్ కొనుగోలు ధర రూ.4.60కు తగ్గించేలా ప్రణాళికలు

## - ఇంధన రంగ పరిశోధనకు ప్రత్యేక యూనివర్సిటీ : సీఎం చంద్రబాబు

**అమరావతి - సూర్య వాస్తవం**

కాలుష్యం తగ్గేలా, పర్యావరణహిత విద్యుత్ ఉత్పత్తిపై దృష్టి సారించాలని ఇంధనశాఖ అధికారుల ను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశిం చారు. ఉండవల్లిలోని తన క్యాంపు కార్యాలయంలో ఇంధనశాఖపై సోమవారం సమీక్ష నిర్వహించారు. పంప్డ్ స్టోరేజ్ విధానంలో విద్యుత్ ఉత్పత్తిపై పూర్తిస్థాయిలో అధ్యయనం చేయాలని, 2028-29 నాటికి సగానికి పైగా విద్యుత్ ఉత్పత్తి పునరుత్పాదక విద్యుత్ ద్వారా వచ్చేలా చూడాలని సిఎం చెప్పారు. విద్యుత్ కొనుగోలు వ్యయం తగ్గాలని, ఆ దిశగా చర్యలపై దృష్టి పెట్టాలని తెలిపారు. విద్యుత్ రంగంలో ఏయే దేశాల్లో ఎలాంటి కొత్త ఆవిష్కరణలు అమలవుతున్నాయో అధ్యయనం చేయాలన్నారు. ఈ ఏడాది చివరినాటికి యూనిట్ కొనుగోలు ధర రూ.4.60కు తగ్గించాలని, ఆ దిశగా దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. విద్యుత్‌లో రీసెర్చ్ అండ్ అనాలసిస్‌కు పెద్దపీట వేయాలని చెప్పారు. దీనికోసం ట్రాన్స్‌కో, జెన్‌కో వంటి సంస్థలు తమకున్న సిఎస్ఆర్ నిధులు కేటాయించాలని, అవసరమైతే రాష్ట్రప్రభుత్వం బడ్జెట్ కేటాయిస్తుందని అన్నారు. ఎనర్జీ యూనివర్సిటీ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. పిఎం సూర్యఘర్ పథకంలో భాగంగా ఇప్పటి వరకు 52,396 సోలార్ రూఫ్‌టాప్ కనెక్షన్లు ఇచ్చామని, దీనిని మరింత వేగవంతం చేయాలన్నారు. ఇకపై ప్రతినెలా రెండు లక్షల పిఎం సూర్యఘర్ కనెక్షన్లు ఇచ్చేలా చూడాలని ఆదేశిం చారు. పిఎం కుసుమ్ పథకంలో ఇప్పటివరకు 2.94లక్షల కనెక్షన్లు ఇచ్చామని, మొదటి విడత పథకాన్ని డిసెంబర్ ఆఖరు నాటికి పూర్తిచేయాలని చెప్పారు.

# ఇంధన కొరత కృత్రిమం..

## - దోపిడీ కోసమేనంటూ జగన్ ఫైర్

## - కూటమి నేతలు, డీలర్లు కుమ్మక్కై దోపిడీకి పాల్పడుతున్నారని ఆరోపణ

## - ధరల పెంపును ఆశించి డీలర్లు బ్లాక్ చేస్తున్నారని విమర్శ

## - ఈ సంక్షోభంతో రైతులు, ఆక్వా రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని వ్యాఖ్య

## - ప్రభుత్వం తీరు మార్చుకోకపోతే ప్రజలు గుణపాఠం చెబుతారని హెచ్చరిక




**అమరావతి- సూర్య వాస్తవం**

రాష్ట్రంలో నెలకొన్న పెట్రోల్, డీజిల్ కొరతపై వైసీపీ అధినేత జగన్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఇది సహజంగా ఏర్పడిన సంక్షోభం కాదని, కూటమి నాయకులు, పెట్రోల్ బంకుల డీలర్లు కుమ్మక్కై సృష్టించిన కృత్రిమ కొరత అని సంచలన ఆరోపణలు చేశారు. సమస్య వచ్చినప్పుడు దాన్ని అనుకూలంగా మార్చుకుని దోచుకోవడం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య అని, ఇప్పుడు పెట్రోల్, డీజిల్ విషయంలోనూ అదే జరుగుతోందని విమర్శించారు. ఐదు రాష్ట్రాల ఎన్నికలు ముగిసిన వెంటనే ఇంధన ధరలు పెరుగుతాయనే అంచనాలతో డీలర్లు ఉద్దేశపూర్వకంగా నిల్వలను బ్లాక్ చేస్తున్నారని జగన్ ఆరోపించారు. ఈ దోపిడీ పర్వంలో వారితో కూటమి నాయకులు జతకట్టి, లబ్ధి పొందేందుకు సిద్ధమయ్యారని అన్నారు. పొరుగు రాష్ట్రాలైన తమిళనాడు, కర్ణాటక, తెలంగాణలో ఎలాంటి కొరత లేనప్పుడు, ఒక్క ఆంధ్రప్రదేశ్‌లోనే ఈ పరిస్థితి ఎందుకు తలెత్తిందని ఆయన ప్రభుత్వాన్ని నిలదీశారు. ప్రభుత్వం చెబుతున్నట్లు సరఫరాలో ఎలాంటి అంతరాయాలు లేవని, ఇది పూర్తిగా మానవ సృష్ట సంక్షోభమని జగన్ స్పష్టం చేశారు. ఈ కృత్రిమ కొరత కారణంగా అన్ని వర్గాల ప్రజలు, ముఖ్యంగా రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని జగన్ ఆవేదన వ్యక్తం చేశారు. ఇది రబీ పంటల కోతల సమయం కావడంతో రైతాంగం తీవ్రంగా నష్టపోతోందని అన్నారు. పంట నూర్పిడి యంత్రాలకు రోజుకు 100 నుంచి 160 లీటర్ల డీజిల్ అవసరం కాగా, సరఫరా నిలిచిపోవడంతో యంత్రాలు పొలాల్లోనే ఆగిపోతున్నాయని తెలిపారు. దీనివల్ల రైతులు కోలుకోలేని నష్టాలను చవిచూస్తున్నారని వివరించారు. అలాగే, ఆక్వా రంగంలో ఏరియేటర్లు నడిపేందుకు డీజిల్ అందక రొయ్యలు, చేపల రైతులు కూడా తీవ్రంగా నష్టపోతున్నారని పేర్కొన్నారు. ఈ తీవ్రమైన సమస్యపై ముఖ్యమంత్రి చంద్రబాబు కనీసం ఒక సమగ్ర సమీక్ష కూడా నిర్వహించకుండా, కేవలం మీడియాకు లీకులిస్తూ కాలయాపన చేస్తున్నారని జగన్ దుయ్యబట్టారు. సరఫరా తగ్గుతుందనే భయంతో ప్రజలే ఎక్కువగా కొనుగోలు చేస్తున్నారని కుంటిసాకులు చెప్పడం సిగ్గుచేటన్నారు. గతంలో విత్తనాలు, ఎరువులు, యూరియా నుంచి వంట గ్యాస్ వరకు ఇలాగే కృత్రిమ కొరత సృష్టించి చంద్రబాబు లబ్ధి పొందారని, ఇప్పుడు ఆ జాబితాలో పెట్రోల్, డీజిల్‌ను చేర్చారని విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వం కళ్లు తెరిచి పరిస్థితిని చక్కది ద్దాలని, లేనిపక్షంలో ప్రజాగ్రహానికి గురికాక తప్పదని, తగిన గుణపాఠం చెబుతారని జగన్ హెచ్చరించారు.

## సంపాదకీయం


### మండే సూరీడు...



సూర్య భగవానుడు మండిపోతున్నాడు. రోజు రోజుకు ఉష్ణోగ్రతలు పెరిగి పోతున్నాయి. మూడు రోజుల క్రితం వరకు చల్లబడ్డ వాతావరణం.. ఒక్కసారిగా వేడెక్కింది. సోమవారం రాష్ట్రంలోనే నిర్మల్ మండలంలోని అక్కాపూర్ గ్రామంలో అత్యధిక ఉష్ణోగ్రత నమోదైంది. వేసవి కాలం ముందే వచ్చేసింది. మార్చి నెల ఆరంభం నుంచే గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఏప్రిల్, మే నెలల్లో ఎండల తీవ్రత అధికంగా ఉంటుందని వాతావరణ శాఖ ఇప్పటికే హెచ్చరికలు జారీ చేసింది. మరో 2 నెలలు కష్టమేనని చెప్పింది. ప్రస్తుతం 44 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవు తుండటంతో ఇక మే నెలలో నలభై ఐదు డిగ్రీలు దాటే అవకాశముందని అంచనా వేస్తున్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ ఎండల తీవ్రత ఎక్కువగానే ఉంది. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈసారి రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశాలున్నాయని వాతావరణ శాఖ నిపుణులు చెబుతున్నారు.అనేక ప్రాంతాల్లో సాధరణం కంటే నాలుగైదు డిగ్రీలు అత్యధికంగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఇక వాడగాల్పులు కూడా ప్రారంభమయ్యాయి. ఉదయం వేళ కొంత చల్లగాలులు వీస్తున్నా ఉదయం పది గంటల నుంచి మాత్రం వేడిగాలుల తీవ్రత ప్రారంభం అవుతుండటంతో వడదెబ్బ తగిలే అవకాశముందని వాతారణ శాఖ అధికారులు తెలిపారు. ప్రజలు అప్రమత్తంగా లేకపోతే మూల్యంచెల్లించుకోవాల్సి ఉంటుందని, ప్రాణాల మీదకు తెచ్చుకోవాల్సి వస్తుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

ఎండల తీవ్రత కారణంగా అనేక వ్యాధులు సంక్రమించే అవకాశముందని, డీహైడ్రేషన్ కు లోను కాకుండా ప్రజలు తరచూ నీటిని తాగుతూ ఉండాలని సూచిస్తున్నారు.తెలంగాణలోనూ హైదరాబాద్ నగరం ఉదయం పది గంటలకే వీధులన్నీ నిర్మానుష్యంగా మారుతున్నాయి. ప్రధానంగా వృద్ధులు, చిన్నారులు, దీర్ఘకాలిక రోగాలతో బాధపడే వారు ఇంటి నుంచి బయటకు రాకపోవడమే మంచిదని సూచిస్తున్నారు. ప్రజలు ఇప్పటికే అనేక వ్యాధులు బారిన పడి ఆసుపత్రులలో చేరుతున్నారని వైద్యులు చెబుతున్నారు. తీవ్రమైన జ్వరంతో పాటు జలుబు, దగ్గు, ఒళు నొప్పుల వంటి వాటితో వస్తున్నారని, కొందరు జ్వరంతో స్పృహకోల్పోతున్నారని కూడా చెబుతున్నారు. ఎండల తీవ్రతకు వ్యాపారాలు దెబ్బతినడంతో చిరు వ్యాపారులు ఇబ్బంది పడుతున్నారు. ఆహార విషయాల్లో కూడా జాగ్రత్తలు పాటించాలని వైద్యులు సూచిస్తున్నారు.ఢిల్లీ సహా ఉత్తర భారత్‌లోని కొన్ని ప్రాంతాల్లో ఈ వీకెండ్‌లో వడగాల్పులు వీచే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ తెలిపింది. దిల్లీలోని కొన్ని ఏరియాల్లో ఉష్ణోగ్రతలు 40 డిగ్రీల సెంటిగ్రేడ్ దాటాయి. ఎండల తీవ్రత పెరగడంతో అధికారులు ఈ హెచ్చరికలు జారీ చేశారు.రాబోయే రెండు, మూడు రోజుల్లో మధ్యప్రదేశ్, రాజస్థాన్ సహా మధ్య, పశ్చిమ భారత్‌లోని కొన్ని రాష్ట్రాల్లో సాధారణం కంటే ఎక్కువ ఉష్ణోగ్రతలు నమోదవుతాయని వాతావరణ శాఖ హెచ్చరించింది.వేసవికాలంలోని తీవ్రమైన ఎండలు ప్రాణాంతకంగా మారొచ్చు. తీవ్రమైన వేడి వల్ల ప్రజలు అనారోగ్యానికి గురవడమే కాకుండా ఒక్కోసారి ప్రాణాలకే ప్రమాదం కావచ్చు. ఉత్తర, మధ్య భారతంలో ఉష్ణోగ్రతలు వారాంతంలో మరో 2-3 డిగ్రీల సెంటిగ్రేడ్ పెరిగే అవకాశం ఉందని శుక్రవారం వాతావరణ శాఖ తెలిపింది.

ప్రతికూల వాతావరణ పరిస్థితులను ఎదుర్కోవడానికి పాఠశాలలకు దిల్లీ విద్యా శాఖ మార్గదర్శకాలు జారీ చేసింది.బహిరంగ ప్రదేశాల్లో క్లాస్‌లు నిర్వహించకూడదని, ఎండలో జరిగే స్కూల్ అసెంబ్లీలను తగ్గించాలని లేదా ఇండోర్‌లో నిర్వహించాలని సూచించింది.పిల్లలు నీళ్లు తాగాలని గుర్తు చేసేందుకు ప్రతి 45-60 నిమిషాలకు ఒకసారి బెల్ మోగించాలని కూడా సూచించింది.2024లో భారత్ ఎదుర్కొన్న మూడింట ఒకవంతు వడగాల్పులకు వాతావరణ మార్పులే కారణమని ఆ ఏడాది మెడికల్ జర్నల్ లాన్సెట్ ప్రచురించిన ఒక రిపోర్టులో పేర్కొన్నారు.2024లో తీవ్రమైన ఎండల కారణంగా దాదాపు 247 బిలియన్ గంటల(24,700 కోట్ల గంటలు) పని సమయాన్ని కోల్పోయినట్లు, దానివల్ల 19,400 కోట్ల డాలర్ల ఆదాయం నష్టపోయినట్లు ఈ రిపోర్ట్ అంచనా వేసింది.ప్రధానంగా వ్యవసాయం, నిర్మాణరంగం వంటి సెక్టార్లు ప్రభావితమైనట్లు పేర్కొంది.ఎక్కువ సమయం పాటు తీవ్రమైన వేడికి గురవ్వడం వల్ల ఆరోగ్యంపై పలు దుష్ప్రభావాలు ఉంటాయని నిపుణులు అంటున్నారు.ఉష్ణోగ్రతలు పెరిగితే డీహైడ్రేషన్, వడదెబ్బ, గుండె సంబంధిత ఒత్తిడి, మరణం సంభవించే ప్రమాదం పెరుగుతుందని హెచ్చరిస్తున్నారు.ముఖ్యంగా పసిపిల్లలు, వృద్ధులు, ఆరుబయట పనిచేసే కార్మికుల్లో ఈ ముప్పు ఎక్కువగా ఉంటుందని చెబుతున్నారు.వేడి ఎక్కువగా ఉన్నప్పుడు నీరు ఎక్కువగా తాగాలి. కనీసం రోజుకు 3 నుంచి 4 లీటర్లు నీరు తాగాలి. కాకరకాయ, దోసకాయ, సొరకాయ వంటి వాటర్ రిచ్ కూరగాయలు డైట్లో చేర్చుకోవాలి. ఇవి శరీరాన్ని కూల్‌గా ఉంచుతాయి. నీటి శాతం ఎక్కువగా ఉండే వాటర్‌మెలన్, మస్క్‌మెలన్ కూడా తీసుకోవచ్చు. ఇవి మీకు ఫ్రెష్ ఫీల్ ఇస్తాయి. బొప్పాయిని కూడా వేసవిలో తీసుకుంటే మంచిది. ఇది జీర్ణ సమస్యలను దూరం చేసి.. శరీరాన్ని లైట్‌గా ఉండేలా చేస్తుంది.మజ్జిగ శరీరానికి చల్లదనం ఇచ్చి డీహైడ్రేషన్‌ను తగ్గిస్తుంది.



నిమ్మరసం విటమిన్ అతో పాటు ఎలక్ట్రోలైట్స్ అందిస్తుంది. కొబ్బరి నీరు నేచురల్ ఎలక్ట్రోలైట్ డ్రింక్? అవుతుంది. వెంటనే ఎనర్జీ అందిస్తుంది. వేసవిలో ఎక్కువ మసాలాలు ఉండేవి కాకుండా లైట్ ఫుడ్స్ తీసుకుంటే మంచిది. అవి సులభంగా జీర్ణమవుతాయి.ఎండలో బయటకు వెళ్లకపోవడమే మంచిది. కానీ బయటకు వెళ్లాల్సి వస్తే.. నీరు తీసుకెళ్లండి. ఎక్కువ సేపు ఎండలో ఉండొద్దు. లైట్, కాటన్ దుస్తులు వేసుకోండి. మద్యాహ్నం 12 నుంచి 3 మధ్య బయటకు వెళ్లడం తగ్గించండి. అలాగే ఫుడ్ విషయంలో జాగ్రత్తలు తీసుకోండి. ఇవి డీహైడ్రేషన్, అలసట వంటివి తగ్గిస్తాయి. ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో కూడా హెల్ప్ చేస్తాయి.

# గోదావరి జిల్లాల్లో డీజిల్ కొరత...

**కాకినాడ– సూర్య వాస్తవం:**

హర్మూజ్ జలసంధిలో ఇరాన్, అమెరికా దేశాల మధ్య నెలకొన్న ఉద్రిక్తతలు ఏపీలోనూ డీజీల్ సరఫరాపై ప్రభావం చూపుతున్నాయి. రోజురోజుకు ఆ దేశాల మధ్య పెరుగుతోన్న ఉద్రిక్తత ఏక్షణాన ఆయిల్ సంక్షోభం తలెత్తుతుందోనన్న భయం అన్ని రంగాల్లోనూ కనిపిస్తోంది. ఆయిల్ డీలర్లు ముందస్తుగా చెల్లింపులు చేస్తేనే బంకులకు డీజీల్, పెట్రోల్ సరఫరా చేస్తామన్న నిర్ణయంతో అటు ఆయిల్ సరఫరా దారులు, బంకుల యజమానుల మధ్య తలెత్తిన ఆర్ధీక లావాదేవీల సమస్యలతో చాలా బంకుల్లో డీజీల్, పెట్రోల్ సరఫరా కానీ పరిస్థితి కనిపిస్తోంది. గత రెండు మూడు రోజులుగా ఉభయ గోదావరి జిల్లాల్లో చాలా బంకుల్లో డీజీల్ నిల్ అనే బోర్డులే దర్శనం ఇచ్చాయి.. ఇది ఒకింత ఆందోళన కలిగించే అంశంగా పరిణమించి ప్రజల్లో పానిక్ పరిస్థితిలోకి నెట్టింది. డీజీల్ కొరత వస్తోందన్న ఆందోళనల నేపథ్యంలో డీజీల్ విక్రయాలు జరుపుతోన్న బంకుల వద్ద డబ్బాలు పట్టుకుని బారులు తీరారు. భారీ వాహనాలు, లారీలు, టిప్పర్లు, కళాశాల బస్సులు కూడా బంకులకు వరుస కట్టాయి. మరో పక్క డీజీల్, పెట్రోల్ ధరలు విపరీతంగా పెరుగుతాయన్న ప్రచారం నేపథ్యంలో కొందరు డీలర్ల కావాలనే కృత్రిమ కొరత సృష్టిస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి.ఇదిలా ఉంటే రైతులు అవసరానికి మంచి డబ్బాల్లోనూ, ట్యాంకుల్లోనూ నింపి మరీ డీజీల్ ను కొనుగోళ్లు చేస్తున్నారు. ఒక్కసారిగా పెట్రోల్ బంకుల వద్ద బారులు తీరుతోన్న వాహనాలు, సోషల్ మీడియాలో జరుగుతోన్న ప్రచారంతో అధికారులు స్పందించారు.. డీజీల్ కొరత ప్రస్తుతం లేదని, ప్రజలు, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసా ఇస్తున్నారు.డీజీల్ కొరత ప్రభావం వ్యవసాయ, ఆక్వా, రవాణా రంగాలపై తీవ్రంగా ప్రభావం పడుతుందంటున్నారు. ఇప్పటికే చాలా బంకుల్లో డీజీల్ లభ్యత లేకపోవడంతో డీజీల్‌తో నడిచే వాహనాలు నిలిపివేసే పరిస్థితి పలు చోట్ల కనిపిస్తోంది. ఇదిలా ఉంటే ఉభయ గోదావరి జిల్లాలో రబీ కోతలు ముమ్మరంగా జరుగుతున్నాయి. 95 శాతం కోతలన్నీ వరికోత యంత్రాల ద్వారానే జరుగుతుండగా డీజీల్ కొరత ప్రభావం వ్యవసాయ రంగంపై తీవ్రంగా పడే అవకాశం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరోపక్క పది రోజులపాటు రాష్ట్రంలో వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ హెచ్చరికలు చేసిన నేపథ్యంలో




రైతులు వరి కోతలను మరింత స్పీడ్ పెంచారు. ఉభయ గోదావరి జిల్లాకు ఆయువుపట్టు అయిన ఆక్వారంగం కూడా డీజీల్ కొరత గనుక జరిగితే తీవ్ర సంక్షోభం ఎదుర్కోవాల్సి వస్తోందని ఆందోళన చెందుతున్నారు. వేసవి కాలం కావడంతో విద్యుత్తు కోతలు తీవ్రంగా ఉంటాయని, జనరేటర్లకు డీజీల్ వినియోగం భారీగా అవసరం ఉన్న నేపథ్యంలో ఇబ్బందులు తప్పవన్న ఆలోచనతో చెరువుల వద్ద డీజీల్ నిల్వలు ఉండేలా చూసుకుంటున్నారు. బంకుల వద్ద లారీలు, కళాశాల బస్సులు క్యూ కడుతుంటే డీజీల్‌తో నడిచే కార్లు, ఇతర వాహనాల డిక్కీల్లో అదనంగా డబ్బాలు తెచ్చుకుని మరీ డీజీల్ పట్టించుకుంటున్నారు. కొంత మంది ఆక్వా రైతులు 200 లీటర్లు సామర్థ్యం ఉన్న డబ్బాల్లో డీజీల్ పట్టించి ట్రాక్టర్లపై తరలించుకుపోతున్నారు.పెట్రోల్, డీజీల్ సరఫరా విషయంలో బంకుల యజమానులు ఆయిల్ డీలర్లకు ముందస్తుగానే చెల్లింపులు చేయాలన్న నిభందనల కొన్ని రోజులుగా అమలు చేస్తున్నారు. దీంతో కొన్ని బంకుల యజమానులు చెల్లింపులు ఆలస్యంగా చేయడం, కొన్ని బంకుల యజమానులు అసలు ముందస్తు డిపాజిట్‌లు చేయకపోవడం వల్ల చాలా బంకుల వద్ద డీజీల్ నిల్ బోర్డులు ఎక్కవగా కనిపిస్తున్నాయంటున్నారు. బంకుల వద్ద మాత్రం డీజీల్ నిల్ అనే బోర్డులు కనిపిస్తుండడంతో సామాన్య ప్రజలు, వాహన దారులు మాత్రం డీజీల్ కొరత వస్తుందన్న అనుమానంతో అవసరం లేకపోయినా అవసరానికి మించి కొనుగోళ్లు చేయడంతో గత మూడు రోజులుగా తూర్పుగోదావరి, అంబేడ్కర్ కోనసీమ, కాకినాడ జిల్లాలో పలు బంకుల్లో డీజీల్ నిల్ బోర్డులు దర్శనం ఇస్తున్నాయి.ఆయిల్ బంకుల వద్ద తలెత్తుతోన్న ప్యానిక్ పరిస్థితులకు ప్రధాన కారణం కొన్ని రోజుల పాటు డీజీల్ దొరకదన్న ప్రచారమే కారణంగా కనిపిస్తోంది. దీని వల్ల డీజీల్ అవసరానికి మంచి కొనుగోళ్లకు వాహన దారులు ఎగబడుతున్నారు. పెట్రోల్ విషయంలో అయితే పెట్రోల్ తో నడిచే ద్విచక్రవాహనాలు, లైట్ మోటారు వెహికల్ తమ అవసరానికి మించి కొనుగోళ్లు చేసినా ఈ పెట్రోల్ కొరత ప్రభావం కేవలం రెండు మూడు రోజులు మాత్రమే కనిపిస్తుందని, ఎందుకంటే వారు నింపిన పెట్రోల్ వినియోగించుకున్నాకే మళ్లీ బంకుల వద్దకు వస్తారని, అయితే డీజీల్ విషయంలో మాత్రం భిన్నంగా ఉంటుందంటున్నారు. రవాణా రంగంలో భారీ వాహనాలకు ఎక్కువగా డీజీల్ అవసరం, వ్యవసాయ, ఆక్వా రంగానికి భారీగా వినియోగం ఉండడం వల్ల డీజీల్ కొరత ప్రభావం ఆయా రంగాలపై తీవ్రంగా పడుంతుంటని ఆందోళన వ్యక్తం అవుతుంది.డీజీల్ అవసరాలకు సరిపడా డీజీల్ నిల్వలున్నాయని అంబేడ్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ తెలిపారు. డీజిల్ సరఫరాపై నెలకొన్న ఆందోళనలను నివృత్తి చేసేందుకు జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ స్థానిక కలెక్టరేట్‌లో ఆయిల్ కంపెనీల ప్రతినిధులు మరియు జిల్లా పెట్రోల్ బంక్ డీలర్ల అసోసియేషన్ తో అత్యవసర సమీక్షా సమావేశం నిర్వహించి పలు ఆదేశాలు సూచనలు చేశారు.

ప్రస్తుతం వరి కోతల సీజన్ మరియు ఆక్వా రంగం అవసరాల దృష్ట్యా డీజిల్ కొరత అనే మాట వినపడకుండా డిమాండ్ సప్లైలు పాటిం చాలని ఆదేశించారు. ఎవరైనా డీలర్లు ఉద్దేశ పూర్వకంగా నిల్వలను దాచినా లేదా కృత్రిమ కొరతను సృష్టించినా వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుం దనీ హెచ్చ రించారు.చమురు నిల్వలు నిండు కుంటాయనే భయంతో బంకుల వద్ద భారీగా క్యూ కట్టవద్దని వాహనదారులు తమకు అవసరమైన మేరకే ఇంధనాన్ని కొనుగో లు చేయాలన్నారు. పుకార్లను వ్యాప్తి చేసే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోబ డతాయ న్నారు అంతర్జా తీయ ఉద్రిక్తతల సమయంలో చమురు సరఫరా లు నిలిచిపోతాయనే ప్రచారం లో వాస్తవం లేదని స్పష్టం చేశారు. జిల్లాలోని అన్ని ఆయిల్ కంపెనీ వద్ద సరిపడా నిల్వలు అందు బాటులో ఉన్నాయని, ప్రజలు ఆందోళన చెందా ల్సిన అవసరం లేదని తెలిపారు.

### కే. ఏం సైపుల్ల మనవడి వివాహ వేడుకలో

## పాల్గొన్న వైసీపీ నాయకులు డాన్ సాదిక్





**అనంతపురం – సూర్య వాస్తవం :** అనంతపురం మాజీ రాజ్యసభ సభ్యులు కే. ఏం సైపుల్ల మనవడు టిడిపి నాయకులు రహంతుల్లా కుమారుడైన కేఎం అరాఫత్ వివాహ మహోత్సవం ఆహ్వానం మేరకు సోమవారం నాడు అనంతపురం పట్టణంలోని స్థానిక ఏపీ లైటింగ్స్ లో వైసీపీ నాయకులు డాన్ సాదిక్ కుటుంబ సామెతంగా హాజరై నూతన వధూ వరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో ఆయన పలువురు నాయకులతో మర్యాదపూర్వకంగా కలిసి స్థానిక రాజకీయాలపై చర్చించారు



## పీఏగా ట్రాన్స్ జెండర్

**గుంటూరు–సూర్య వాస్తవం:**

గుంటూరు పశ్చిమ నియోజకవర్గం టీడీపీ ఎమ్మెల్యే గల్లా మాధవి వినూత్న నిర్ణయం తీసుకున్నారు. సమాజంలో వివక్షకు, అవమానాలకు గురౌతున్న ట్రాన్స్‌జెండర్‌కు అండగా నిలబడ్డారు గల్లా మాధవి. తన కార్యాలయంలో ట్రాన్స్‌జెండర్‌కు ఉద్యోగం కల్పించి.. తన నిబద్ధతను మాటల్లో కాకుండా, చేతల్లో చేసి చూపించారు. ట్రాన్స్‌జెండర్లకు గౌరవప్రదమైన జీవనోపాధి కల్పించే దిశగా.. తన వ్యక్తిగత సహాయకురాలిగా ట్రాన్స్‌జెండర్‌ను నియమించుకుని సరికొత్త ఒరవడికి శ్రీకారం చుట్టారు.ట్రాఫిక్ సిగ్నళ్ల వద్ద, రైళ్లల్లో ట్రాన్స్‌జెండర్లను గమనించినప్పుడు ఎందుకు వీరిలా ఉంటున్నారని తనకు అనిపించేదని గల్లా మాధవి చెప్తున్నారు.


### కే. ఏం సైపుల్ల మనవడి వివాహ వేడుకల్లో

## పాల్గొన్న ఐఎంఎం మహబూబ్ బాషా





**అనంతపురం – సూర్య వాస్తవం :** అనంతపురం మాజీ రాజ్యసభ సభ్యులు కే.ఏం సైపుల్ల మనవడు టిడిపి నాయకులు రహంతుల్లా కుమారుడైన కేఎం అరాఫత్ వివాహ మహోత్సవం ఆహ్వానం మేరకు సోమవారం నాడు అనంతపురం పట్టణంలోని స్థానిక ఏపీ లైటింగ్స్‌లో ఐఎంఎం మహబూబ్ బాషా తన కుటుంబంతో సహా హాజరై నూతన వధూ వరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో ఆయన పలువురు నాయకులతో మర్యాద పూర్వకంగా కలిసి స్థానిక రాజకీయాలపై చర్చించారు.



# హనీ ట్రాప్ కేసులో నలుగురు పోలీసులపై వేటు..!

- రాప్తాడు సీఐ శ్రీహర్షతో పాటు హెడ్ కానిస్టేబుల్ గిరి, కానిస్టేబుల్స్ దుర్గాప్రసాద్, దేవ్లానాయక్ ఉద్యోగం నుండి డిస్మిస్
- అనంతపురం రూరల్ సీఐ శేఖర్ వీఆర్‌కు పంపడమే కాకుండా కర్నూలు రేంజ్ డీఐజీకి సరెండర్
- రూరల్ ఎస్ఐ రాంబాబుతో పాటు కానిస్టేబుళ్లు దేవేంద్ర, జయరాంలను సస్పెండ్ చేస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ
- ట్రైనీ ఐపీఎస్ అశ్విన్ మణిదీప్, తాడిపత్రి ఏఎస్పీ రోహిత్ చౌదరితో ప్రత్యేకంగా దర్యాప్తు
- మొత్తం 9 మంది పోలీసు అధికారులు, సిబ్బంది తొలగింపు

అనంతపురం క్రైమ్ - సూర్య వాస్తవం :

రాష్ట్రంలో సంచలనం సృష్టించిన అనంతపురం జిల్లా హనీ ట్రాప్ కేసులో సీఐ, ముగ్గురు పోలీసులను డిస్మిస్ చేశారు. ఎస్ఐ, ఇద్దరు కానిస్టేబుళ్లపై సస్పెన్షన్ వేటు పడింది. మరో సీఐని కర్నూలు డీఐజీకి అటాచ్ చేశారు. అనంతపురం రేంజ్ ఐజీ, కర్నూలు రేంజ్ డీఐజీ, అనంతపురం జిల్లా ఎస్పీ జగదీశ్ ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. రాప్తాడు సీఐ శ్రీహర్ష, అనంతపురం రూరల్ హెడ్ కానిస్టేబుల్ గిరి, కానిస్టేబుల్ దుర్గాప్రసాద్, ఇటుకలపల్లి కానిస్టేబుల్ దేవలా నాయక్ను సర్వీసు నుంచి తొలగించారు. అనంతపురం రూరల్ ఎస్ఐ రాంబాబు, అదే స్టేషన్లో పని చేస్తున్న కానిస్టేబుళ్లు దేవేంద్ర, జయరాం నాయక్‌ను సస్పెండ్ చేశారు.

పోలీస్ వ్యవస్థలో జవాబుదారీతనం పెంచేలా తప్పు చేసిన తమ సిబ్బందిపై క్రమశిక్షణా చర్యలు తీసుకున్నారు పోలీసు ఉన్నతాధికారులు .పోలీసుల పనితీరులో క్రమశిక్షణ తప్పితే కఠిన చర్యలకు వెనకాడబోమని చివరికి వారు పోలీసులైనా సరే తప్పు చేస్తే వదిలిపెట్టే ప్రసక్తే లేదని డీఐజీ షిమోషి బాజ్పాయ్, ఎస్పీ జగదీశ్ తప్పు చేసిన వారి సిబ్బంది



ఉద్యోగాల తొలగింపులతో హెచ్చరిక జారీ చేశారు. అనంతపురంలో ఇటీవల వెలుగులోకి వచ్చిన హనీ ట్రాప్ ముఠాల ఉదంతం తీవ్ర సంచలనం సృష్టించింది. శృంగార భరితమైన ఎర వేసి, అవతలి వ్యక్తిని వలలో వేసుకుని వారి నుండి డబ్బును దోచుకునే హనీట్రాప్ ముఠాతో చేతులు కలిపి అక్రమాలకు పాల్పడినట్లు అభియోగాలు ఎదుర్కొంటున్న నలుగురు పోలీసులను ఏకంగా సర్వీసు నుండి తొలగిస్తూ (డిస్మిస్) సంచలన నిర్ణయం తీసుకున్నారు. ఉద్యోగాల నుండి తొలగించిన వారిలో రాప్తాడు సీఐ శ్రీహర్షతో పాటు హెడ్ కానిస్టేబుల్ గిరి, కానిస్టేబుల్స్ దుర్గాప్రసాద్, దేవ్లానాయక్ ఉన్నారు.

ఈ వ్యవహారంలో నిర్లక్ష్యం వహించిన మరికొంతమంది పోలీసు అధికారులపై కూడా క్రమశిక్షణా చర్యలు చేపట్టారు. అనంతపురం రూరల్ సీఐ శేఖర్ను వీఆర్ కు పంపడమే కాకుండా, ఆయనను కర్నూలు రేంజ్ డీఐజీకి సరెండర్ చేశారు. అలాగే, ఈ కేసులో ప్రమేయం ఉన్నట్లు భావిస్తున్న ఎస్ఐ రాంబాబుతో పాటు కానిస్టేబుళ్లు దేవేంద్ర, జయరాంలను సస్పెండ్ చేస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. పోలీసులే హనీట్రాప్ ముఠాకు సహకరించడం రాష్ట్ర వ్యాప్తంగా హాట్ టాపిక్ అయింది. దాంతో పోలీస్ శాఖ వీరిపై కఠిన చర్యలు తీసుకుంది.

## 'జిల్లా పోలీస్ గ్రీవెన్స్'లో 150 వినతులు స్వీకరణ

- వెంటనే పరిష్కారం చూపాలని ఆదేశాలు జారీ చేసిన జిల్లా ఎస్పీ పి.జగదీష్





**అనంతపురం క్రైమ్ - సూర్య వాస్తవం :** అనంతపురం జిల్లా ఎస్పీ పి. జగదీష్ సోమవారం నాడు స్థానిక పోలీస్ కాన్ఫరెన్స్ హాల్లో పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసల్ సిస్టమ్ కార్యక్రమాన్ని నిర్వ హించారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ ప్రజల నుండి వివిధ సమస్యలపై 150 అర్జీలను స్వీకరించారు. ప్రజల సమస్యలను శ్రద్ధగా విని, వాటిని తక్షణమే పరిశీలించి చట్టపరిధిలో పరిష్కరించేలా సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అదేవిధంగా...ఈ కార్యక్రమానికి హాజరైన పిటిషనర్లు మరియు వారి వెంట వచ్చిన వారికి ఇస్కాన్ సంస్థ వారి సహకారంతో ఉచిత భోజన ఏర్పాట్లు చేయడం జరిగింది. పోలీసు అధికారులు పాల్గొని స్వయంగా వారే భోజనం వడ్డించారు. ఈసందర్భంగా ప్రజలు జిల్లా పోలీస్ యంత్రాంగానికి మరియు ఇస్కాన్ సంస్థకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ పిజిఆర్ఎస్ కార్యక్రమంలో అనంతపురం అర్బన్ డీఎస్పీ వి.శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

## ఇంధన విక్రయాలపై పోలీసుల నిఘా

- పెట్రోల్, డీజిల్ కొరతపై వదంతులు, అసత్య ప్రచారాలు నమ్మవద్దు
- నల్లబజారులో విక్రయాలకు పాల్పడితే కఠిన చర్యలు - జిల్లా ఎస్పీ పి. జగదీష్

అనంతపురం క్రైమ్ - సూర్య వాస్తవం :



అనంతపురం జిల్లాలో పెట్రోల్, డీజిల్ కొరత ఉందంటూ అసత్య ప్రచారాలు, సామాజిక మాధ్యమాల్లో వ్యాప్తి చెందుతున్న వదంతులను ప్రజలు ఎట్టి పరిస్థితుల్లోనూ నమ్మవద్దని జిల్లా ఎస్పీ పి. జగదీష్ తెలియజేశారు. ప్రజలు ఎవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని...ప్రస్తుతం జిల్లాలోని అన్ని పెట్రోల్ బంకుల్లో పెట్రోల్, డీజిల్ నిల్వలు సమృద్ధిగా ఉన్నాయని, ఎటువంటి కొరత లేదని వెల్లడించారు. ఇంధన సరఫరా, విక్రయాలపై జిల్లా పోలీసు శాఖ నిరంతర పర్యవేక్షణ కొనసాగిస్తున్నదని, ఇప్పటికే అన్ని పోలీసు స్టేషన్లకు అవసరమైన మార్గదర్శకాలు జారీ చేసినట్లు తెలిపారు. బంక్ నిర్వాహకులు పారదర్శకంగా, క్రమబద్ధంగా విక్రయాలు నిర్వహించి వినియోగదారులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని ఆదేశించారు. ఎవరైనా ఉద్దేశపూర్వకంగా ఇంధన విక్రయాలను నిలిపివేసినా, అక్రమ నిల్వలు సృష్టించినా, నల్లబజారులో విక్రయాలకు పాల్పడినా, లేదా సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలు చేసి ప్రజల్లో భయాందోళనలు సృష్టించినా, అటువంటి వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వదంతులను నమ్మి అవసరానికి మించి ఇంధనాన్ని కొనుగోలు చేసి ఇళ్లలో నిల్వ చేయడం ప్రమాదకరమని, దీనివల్ల అగ్ని ప్రమాదాలు సంభవించే అవకాశముందని ఎస్పీ గారు సూచించారు. అదేవిధంగా, అనవసర నిల్వల కారణంగా నిజంగా అవసరమైన వారికి ఇంధనం అందకపోవచ్చని తెలిపారు. జిల్లాలో పోలీసులు రెవెన్యూ, సివిల్ సప్లైస్ శాఖలతో కలిసి ఇంధన నిల్వలు, సరఫరా పరిస్థితిని క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షిస్తున్నారని పేర్కొన్నారు. ఎవరైనా ఇంధనాన్ని బ్లాక్ చేయడం, నల్లబజారులో విక్రయించడం, లేదా అసత్య ప్రచారాలు చేయడం గమనించినట్లయితే వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా డయల్ 112 కు సమాచారం అందించాలని కోరారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని జిల్లా ఎస్పీ స్పష్టం చేశారు.

# హనీ ట్రాప్ కేసులో కీలక సూత్రధారి అరెస్ట్

- రుద్రంపేట మాజీ వైస్ సర్పంచ్ నరేంద్రరెడ్డితో కలిసి ఇద్దరు అరెస్టు
- 2 సెల్ ఫోన్లు స్వాధీనం
- రిమాండ్ కు తరలింపు



**అనంతపురం క్రైమ్ - సూర్య వాస్తవం :** అనంతపురం హనీ ట్రాప్ కీలక నిందితురాలు రంగమ్మ అలియాస్ చిన్ని, ఉమాదేవి, మల్లీశ్వరి గ్యాంగులతో క్రియాశీలక సంబంధాలు కలిగి ఉన్న రుద్రంపేట పంచాయతీ, అనంతపురము రూరల్ మండలం రుద్రంపేట మాజీ వైస్ సర్పంచ్ కనుముక్కల నరేంద్ర రెడ్డి హనీ ట్రాప్ కేసులో నరేంద్రరెడ్డి క్రియాశీలకపాత్ర పోషించాడు. రంగమ్మ ఏ చిన్ని గ్యాంగ్‌కు మరియు ఉమాదేవి, మల్లీశ్వరి గ్యాంగులతో మంచి సంబంధాలు నెరిపాడు. హనీ ట్రాప్‌లో చిక్కుకున్న బాధితులు మరియు వారి కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి పంచాయతీలు చేయడం... బలవంతంగా డబ్బులు వసూలు చేయడం, సెటిల్మెంట్లు చేయించడం వంటి కార్యకలాపాల్లో ఇతని పాత్ర ఉన్నట్లు పోలీసుల విచారణలో తేలింది. అంతేకాకుండా... హనీ ట్రాప్ గ్యాంగ్ లకు సమస్యలు తలెత్తినప్పుడు కొందరు మీడియా వారితో సంప్రదింపులు జరిపి సెటిల్ చేయడంలో కూడా ఇతను కీలక పాత్ర పోషించినట్లు వెల్లడైంది.

**2) పొత్తూరు ఓం ప్రకాష్, వయస్సు 45 సం.,**

ఇతను హనీ ట్రాప్ కేసులో ప్రధాన నిందితురాలు రంగమ్మకు బంధువు. పైగా ఆమె స్కార్పియో వాహనానికి డ్రైవర్‌గా పనిచేస్తూ, ఈ హనీ ట్రాప్ కార్యకలాపాల్లో సోదరుడి పాత్ర పోషించి బాధితులను భయపెట్టాడు

**అరెస్ట్ ... రిమాండ్ :** ఈ హనీ ట్రాప్ కేసు దర్యాప్తులో భాగంగా ఈరోజు సదరు నిందితులను అరెస్టు చేశామని... అనంతరం కోర్టు ముందు హాజరు పరచగా రిమాండ్ విధించడంతో జిల్లా జైలుకు తరలించినట్లు అనంతపురం రూరల్ డీఎస్పీ టి.శ్రీనివాసులు తెలిపారు.

## ఆరేళ్ల పాపపై అత్యాచార యత్నానికి పాల్పడిన కామాంధుడిని కఠినంగా శిక్షించాలి

- యూనైటెడ్ జాయింట్ యాక్షన్ కమిటీ డిమాండ్



**అనంతపురం - సూర్య వాస్తవం :** అనంతపురం పట్టణంలోని రుద్రంపేట పంచాయతీ పరిధిలోని స్థానిక చంద్రబాబు నాయుడు కాలనీలో నాలుగు రోజుల క్రితం శుక్రవారం మనవరాలు వయసు ఉన్న బాలిక పైన 65 ఏళ్ల ఖాజా హుస్సేన్ అత్యాచార యత్నానికి పాల్పడిన కామాంధుడిని కఠినంగా శిక్షించాలని యూజెఏసి డిమాండ్ చేశారు. 20 సంవత్సరాలుగా భార్య పిల్లలకు దూరంగా ఉంటున్న ఖాజా హుస్సేన్ కుటుంబ విలువలు తెలియని మూర్ఖుడు. ఈ సంఘటన సభ్యసమాజంలో తలదించుకొనేలా ఉంది కావున అతను సమాజంలో ఉండడానికి అనర్హుడు. అత్యాచార యత్నం ఘటన తర్వాత కాలనీ వాసులు దేహశుద్ధి చేసి కఠినంగా శిక్షించారు. చంద్రబాబు నాయుడు కాలనీ ప్రజలకు అభినందనలు. యునైటెడ్ జాయింట్ యాక్షన్ కమిటీ కులము మతము చూడదు బాధితుల తరఫున, న్యాయం పక్షానా నిలబడుతుంది. పోలీసులు ఎట్టకేలకు నిందితున్ని అరెస్టు చేసి కోర్టుకు హాజరపరిచారు. ఖాజా హుస్సేన్ కు ఇది వరకు ఇటువంటి ఆరోపణలు ఉన్నాయి. చిన్నపిల్లలు మహిళలపైన జరుగుతున్న అఘాయిత్యాలు అత్యాచారాలు వీటన్నింటిపైన యూజెఏసి గట్టిగా నిలబడుతుంది. మహిళల సున్నితమైన అంశం మా దృష్టికి వచ్చిన తర్వాత విచారించి సమగ్రమైన సమాచారం సేకరించి చట్టపరంగా శిక్షించాలని అధికారులను డిమాండ్ చేస్తుంది. ఈ విషయాలలో మతము కులము వయస్సు ఇవన్నీ చూడము. ఎంతటి వారైనా వదలం జస్టిస్ న్యాయం కొరకు చివరి వరకు ఉంటాము. ఈ కార్య క్రమంలో యుజెఎసి నాయకులు బాబాషా, మాజీ మేయర్ వసీం , మాజీ వక్ఫ్ బోర్డు చైర్మన్ కాగజ్ ఘర్ రిజ్వాన్ , జె ఎం బాషా తదితరులు పాల్గొన్నారు...

బడి పిలుస్తోంది కార్యక్రమం ఘన ప్రారంభం

# ఇంటింటికీ విద్యా సందేశం

"బడి ఈడు పిల్లలు తప్పనిసరిగా పాఠశాలలో ఉండాలి"

- ఎంఈఓ కస్తూరయ్య

## ప్రభుత్వ పాఠశాలల్లో చేరికల పెంపే లక్ష్యం

## విద్యాశాఖ ప్రత్యేక కార్యక్రమం









**పెళ్లకూరు - సూర్య వాస్తవం :**తిరుపతి జిల్లా పెళ్లకూరు మండలంలో విద్యాశాఖ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "బడి పిలుస్తోంది" కార్యక్రమం సోమవారం ఘనంగా ప్రారంభమైంది. పెళ్లకూరు గవర్నమెంట్ ఉన్నత పాఠశాల ప్రాంగణం నుండి ఉదయం 8:30 గంటలకు ప్రచార రథాన్ని మండలాధ్యక్షుడు సంచి కృష్ణయ్య యాదవ్ పచ్చ జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండలంలోని ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సీఎంఆర్టీలు, ఎంఆర్సీ సిబ్బంది, విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల చేరికను పెంచడం, బడి బయట ఉన్న పిల్లలను తిరిగి విద్యాబాట పట్టించడం లక్ష్యంగా ఈ వినూత్న కార్యక్రమాన్ని విద్యాశాఖ రూపొందించింది. మండల విద్యాశాఖ అధికారులు కస్తూరయ్య, మించల శంకరయ్య ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ ప్రచార యాత్ర 2026--2027 విద్యా సంవత్సరానికి ప్రత్యేకంగా రూపొందించబడింది. రాష్ట్రవ్యాప్తంగా 36 మండలాల్లో 36 రోజుల పాటు ప్రచార రథాలు తిరుగుతూ ప్రజల్లో చైతన్యం కల్పించనున్నాయి. ఈ ప్రచార రథం ద్వారా ఉపాధ్యాయులు ఇంటింటికీ వెళ్లి తల్లిదండ్రులను కలుసుకుని ప్రభుత్వ పాఠశాలల్లో అందిస్తున్న నాణ్యమైన విద్య, ఆధునిక సదుపాయాలు, పుస్తకాలు, యూనిఫారాలు, మధ్యాహ్న భోజన పథకం వంటి సంక్షేమ కార్యక్రమాలపై అవగాహన కల్పించనున్నారు. విద్యపై తల్లిదండ్రుల్లో నమ్మకాన్ని పెంచి, ప్రతి బాలుడు పాఠశాలలో చేరేలా చేయడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యం. ఈ సందర్భంగా ఎంఈఓ-1 కస్తూరయ్య మాట్లాడుతూ, "బడి ఈడు పిల్లలు అందరూ తప్పనిసరిగా పాఠశాలల్లో ఉండాలి. డ్రాపౌట్ అనే పరిస్థితి లేకుండా చూడడం మనందరి బాధ్యత" అని పేర్కొన్నారు. గత సంవత్సరంతో పోలిస్తే ఈసారి విద్యార్థుల నమోదును గణనీయంగా పెంచాలని సూచించారు. ఎంఈఓ-2 మించల శంకరయ్య మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో చేరికలను పెంచడం ద్వారా జిల్లాకు రాష్ట్రస్థాయిలో మంచి గుర్తింపు తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. ఈ కార్యక్రమం రాష్ట్రంలోనే ప్రత్యేకమైనదిగా నిలుస్తుందని, ప్రధానోపాధ్యాయులు చొరవ తీసుకుని విజయవంతం చేయాలని కోరారు. ఈ సందర్భంగా పెళ్లకూరు గవర్నమెంట్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాయపాటి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ,"ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి అనేక అవకాశాలు ఉన్నాయి. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి వారి భవిష్యత్తుకు బలమైన పునాది వేయాలి. 'బడి పిలుస్తోంది' కార్యక్రమాన్ని అందరూ సమిష్టిగా విజయవంతం చేయాలి" అని అన్నారు. ఈ కార్యక్రమంలో పెళ్లకూరు మండల టిడిపి సీనియర్ నాయకులు పేరం రమేష్ నాయుడు, మేక పిల్ల రవి, పరుశురాం, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. ప్రచార రథం మండలంలోని వివిధ గ్రామాల్లో పర్యటిస్తూ విద్యా పై అవగాహన కల్పించనుంది.

# పెట్రోల్, డీజిల్ కొరత లేకుండా చూడండి

- పెట్రోల్ బంకుల యజమానులకు తహసిల్దార్ రెడ్డి శేఖర్ సూచన

**కదిరి- సూర్య వాస్తవం** కదిరి పట్టణంలో వాహనదారులకు పెట్రోల్ డీజిల్ కొరత లేకుండా చూడాలని కదిరి తహసిల్దార్ రెడ్డి శేఖర్ పెట్రోల్ బంకుల యజమానులకు సూచించారు. : రెండు రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా డీజిల్ పెట్రోల్ కొరత వాహన చోదకులను వేధిస్తోంది. ఈ విషయాన్ని ఈ విషయాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కూడా తీవ్రంగా పరిగణించి వాహనదారులకు ఎక్కడ డీజిల్ పెట్రోల్ కొరత లేకుండా చూడాలని జిల్లా కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేశారు ఈ నేపథ్యంలో శ్రీ సత్య సాయి జిల్లా కలెక్టర్ ఏ శ్యాంప్రసాద్ ఆదేశాల మేరకు తహసిల్దార్ రెడ్డి శేఖర్ సోమవారం పట్టణంలోని పెట్రోల్ బంకులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. వాహన చోదకులకు డీజిల్ పెట్రోల్ కొరత సృష్టిస్తే అలాంటి వారిపై చర్యలు తీసుకుంటామని చెప్పారు ఇప్పటికే వాహనదారుల అవసరాలను గుర్తించి రాష్ట్ర ప్రభుత్వం కూడా ఎప్పటికప్పుడు ఆయా కంపెనీలతో మాట్లాడి సకాలంలో డీజిల్ పెట్రోల్ ను సరఫరా చేయడానికి చర్యలు తీసుకుంటుందని వివరించారు. మీ వద్ద పెట్రోల్ బంకుల్లో స్టాకు ఉన్నంతవరకు వాహనదారులకు పట్టాలని అనవసరంగా



పెట్రోల్ బంకుల వద్ద నో స్టాక్ బోర్డులు పెట్టడం అడ్డంగా తాళ్లు కట్టడం లాంటి పనులు చేయకూడదని హెచ్చరించారు తహసిల్దార్ తో పాటు సి ఎస్ డి టి కెవి రవి ప్రసాద్,ఆర్ఐ విజయ్ సిబ్బంది వెంకటేష్ తదితరులు ఉన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే మా లక్ష్యం

## ప్రజా దర్బార్లో పులివెందుల టిడిపి ఇంచార్జ్ బిటెక్ రవి

**పులివెందుల సూర్య వాస్తవం:** పులివెందుల టీడీపీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన 'ప్రజా దర్బార్' కార్యక్రమంలో నియోజకవర్గంలోని వివిధ మండలాల నుండి వచ్చిన ప్రజల విన్నపాలను స్వయంగా స్వీకరించాను. గత ఐదేళ్ల కాలంలో పాలకుల నిర్లక్ష్యం వల్ల సామాన్య ప్రజలు ఎదుర్కొన్న ఇబ్బందులను తొలగించి, వారికి మెరుగైన సేవలందించడమే మన కూటమి ప్రభుత్వ లక్ష్యం అన్నారు.ప్రజల నుండి అందిన అర్జీలపై తక్షణమే స్పందిస్తూ, క్షేత్రస్థాయిలో పరిష్కారం చూపేందుకు సంబంధిత అధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడి తగిన ఆదేశాలు జారీ చేయడం జరిగింది. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చూస్తామని, ఎక్కడా అవినీతికి తావులేకుండా పారదర్శకమైన పాలనను అందిస్తామని మీకు భరోసా ఇస్తున్నాను. మీ కష్టసుఖాల్లో తోడుంటూ, పులివెందుల నియోజకవర్గ సర్వతోముఖాభి వృద్ధికి నిరంతరం కృషి చేస్తూ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటాను.అని భరోసా ఇవ్వడం జరిగింది.. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ప్రజలు టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు



అందుల ఆశ్రమంలో

## దివంగత వైయస్ అభిషేక్ రెడ్డి జన్మదిన వేడుకలు

యువజన విభాగం అధ్యక్షుడు రామ్ లక్ష్మణ్ రెడ్డి



**పులివెందుల సూర్య వాస్తవం:** దివంగత వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నేత డాక్టర్ అభిషేక్ రెడ్డి 38 వ జయంతి సందర్భంగా సోమవారం పులివెందులలోనివీరనారాయణ అందుల అనాథ మహిళా ఆశ్రమంలో వైయస్ అభిషేక్ రెడ్డి జన్మదిన వేడుకలు వైఎస్సార్సీపి పులివెందుల నియోజకవర్గం అధ్యక్షుడు రామ్ లక్ష్మణ్ రెడ్డి యువనాయకులు మహేష్ రెడ్డి,రాజేష్,ప్రదీప్ ల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది .ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి నాయకులు మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ చిన్నప్ప, షమీవుల్లా ,చంద్రమౌళి,కనక,షాను,నాగరాజు యువ నాయకులు నంద,హరి,రఫీ తదితరులు పాల్గొన్నారు.

# ప్రమాదానికి ఆహ్వానం...!

కులడానికి సిద్ధమైన విద్యుత్ స్తంభం

## సిబ్బంది నిర్లక్ష్యం

## పట్టించుకోని అధికారులు






**కణేకల్ - సూర్య వాస్తవం:** మండల పరిధిలోని సొల్లాపురం గ్రామంలో ప్రజల ప్రాణాలకు ముప్పుగా మారిన ప్రమాదకర పరిస్థితి నెలకొంది. గ్రామంలోని సెకండ్ బస్టాప్ సమీపంలో ఉన్న మెయిన్ లైన్ విద్యుత్ స్తంభం కింది భాగం పూర్తిగా దెబ్బతిని ఎప్పుడైనా కూలిపోయే స్థితిలో ఉన్నా, సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడం స్థానికుల్లో తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది.ప్రస్తుతం ఆ స్తంభం మరో సపోర్ట్ స్తంభం ఆధారంగా మాత్రమే నిలబడి ఉన్న దృశ్యం కనిపిస్తోంది. ఈ పరిస్థితిలో చిన్న గాలి వాన వచ్చినా స్తంభం కూలిపోవచ్చనే భయం వ్యక్తమవుతోంది. అయినప్పటికీ విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్య ధోరణి ప్రజల విమర్శలకు దారితీస్తోంది. ఇది పర్యవేక్షణ లోపమా? లేక బాధ్యతారాహిత్యమా? అని గ్రామస్థులు ప్రశ్నిస్తున్నారు.ఈ మార్గంలో ప్రతిరోజూ విద్యార్థులు, ప్రయాణికులు పెద్ద సంఖ్యలో రాకపోకలు సాగిస్తుండటంతో ప్రమాదం సంభవించే అవకాశాలు అధికంగా ఉన్నాయని స్థానికులు చెబుతున్నారు. ముఖ్యంగా వర్షాకాలంలో గాలివానలు వేగంగా వీస్తే స్తంభం కూలిపోవడం ఖాయం అనే భయం వ్యక్తమవుతోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రమాదకరంగా ఉన్న ఈ విద్యుత్ స్తంభాన్ని వెంటనే తొలగించి కొత్త స్తంభాన్ని ఏర్పాటు చేయాలని గ్రామ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. లేకపోతే ఎప్పుడైనా జరిగే ప్రమాదానికి బాధ్యత ఎవరు వహిస్తారు? అనే ప్రశ్న నిలుస్తోంది.

# వర్మ కు అస్సలు సమస్య ఏంటి ?

## కూటమిని కూటమి పార్టీగానే ఉండనిద్దాం

## వర్మను సూటిగా ప్రశ్నిస్తున్న జనసేన నాయకులు



**వేంపల్లె సూర్య వాస్తవం:** జనసేన పార్టీ పులివెందుల ఇంచార్జ్ డాక్టర్.హరీష్ నేతృత్వంలో వేంపల్లె నాయకులు గోసల ఆంజనేయులు మాట్లాడుతూ, పదేపదే పిఠాపురం వర్మ డిప్యూటీ సీఎం.పవన్ కళ్యాణ్ ను కించపరిచే విధంగా మాట్లాడడం సబబు కాదు. మరి ఆ విషయం టిడిపి అధిష్టానానికి తెలుసు. అధిష్టానానికి చెవులు ఉన్నాయి. రాష్ట్ర ఇంచార్జ్ అయిన పల్లాకి చెవులు ఉన్నాయి. మన ద్వారా లబ్ది పొందుతున్న వారికి చెవులు ఉన్నాయి . వర్మ విషయంలో చెవులు ఎందుకు మూసుకు పోతున్నాయి. అని టిడిపి అధిష్టాన్నిఅడుగుతున్నాము.చంద్రబాబు నాయుడు అన్నా లోకేష్ అన్నా మాకు విపరీతమైన గౌరవం ఉంది. కానీ వర్మ లాంటి టిడిపి నాయకుల వల్ల కూటమి పార్టీ దెబ్బతింటుంది. అసలు వర్మకి ఏంటి సమస్య? చంద్రబాబు ఫోటోలేనా? కూటమి పార్టీలను చీల్చాలని ఉద్దేశమా, ఇంకేమైనా ఉందా అని సూటిగా ప్రశ్నిస్తున్నాము. దయచేసి ఒక్కసారి చంద్రబాబు,పవన్ కళ్యాణ్, లోకేష్ లను చూడండి. వాళ్లు ఎంత అన్యోన్యంగా ఉన్నారో మనము కూడా అలాగే ఉందాం.కూటమిలో చీలికలు ఏర్పరచకండి.ఎవరో ప్రతిపక్ష పార్టీల మాటలు విని బిజెపి, టిడిపి, జనసేన మిత్రపక్ష పార్టీలను చెడగొట్టకండి అని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు సుధీర్ రెడ్డి, శ్యామ్, దేవా, పట్టెం ఉదయ్, ఇడుపులపాయ జయచంద్ర, అంజి తదితరులు పాల్గొన్నారు.

### భావసారా క్షత్రియ సమాజ్, భజనమండలఆధ్వర్యంలో భారీ శోభయాత్ర



**పామిడి -సూర్య వాస్తవం:** పామిడి లో సోమవారం ఏకాదశి సందర్బంగా భావసారా క్షత్రియ సమాజ్, భజనమండలఆధ్వర్యంలో భారీ శోభయాత్ర (ర్యాలీ )నిర్వహించారు. పుర వీధుల్లో మరాఠి అభంగాలు (భజనలు )చేస్తూ ర్యాలీ చేశారు. మహిళలు తలపై తులసి మొక్కలు, కళాశాలు ఉంచుకొని రుక్మిణి, పాండురంగస్వామి విగ్రహాలతో ర్యాలీ చేశారు. పాండురంగస్వామి కుంభ సంప్రోక్షణ లో భాగంగా నూతన ద్వజస్థంబా ప్రతిష్ఠ పంచారాత్ర ఆగమ పద్ధతి లో వేద పండితులు నిర్వహించారు. కర్మంగా స్నపానం, మూర్తి హోమం, క్షిరాదివాసం నిర్వహించారు.

సూర్య వాస్తవం
Truth of News
http://www.suryavastavam.in

# అప్పుల బాధ తాళలేక రైతు ఆత్మహత్య



**పామిడి- సూర్య వాస్తవం:** పామిడి మండలంలోని కోనేపల్లి గ్రామానికి చెందిన రైతు బాలం.వేణుకుమార్ యాదవ్(40) అప్పుల బాధ తాళలేక సోమవారం క్రిమిసంహారక మందు సేవించి ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు ఇచ్చిన వివరాలు ఇలా ఉన్నాయి.మృతుడు వేణుకుమార్ కు వర్షాధారపు భూమి 4 ఎకరాలు కలదు. అందులో 7ఏళ్ల క్రితం బోరు వేసి 440 చీనీ చెట్లను నాటాడన్నారు. ఈఎడాది తీవ్రమైన వేసవికాలం ఎండలకు బోరులో భూగర్భ జలాలు ఇంకిపోవడంతో నోటి దగ్గరకొచ్చిన చీనిచెట్లు కాయలతో నిట్టనిలువున ఎండిపోవడంతో దిక్కు తోచక బోర్ వెల్స్ చుట్టూ10 రోజులుగా తిరిగాడు వారు రేపు మాపు అనుకుంటూ కాలం వెళ్ళపుచ్చు చుండగా సోమవారం ఉదయం తోటకు వెళ్లి పూర్తిగా ఎండిపోయిన చీనీ చెట్లను చూశాడు. చీని చెట్లను ఇన్ని ఏళ్లుగా బ్రతికించడానికి, కుటుంబాన్ని పోషించడానికి ఆడ కూతురులను చదివించడానికి దాదాపు10 లక్షల పైన అప్పు అయినది. వాటిని ఎలా తీర్చేదని మనస్థాపానికి గురి అయ్యి ఇంటిలో ఎవరూ లేని సమయం చూసి పురుగుల మందు సేవించి ఆత్మహత్య చేసుకున్నాడన్నాడన్నారు. పోలీసులకు సమాచారం అందించడంతో పోస్టుమార్టం నిమిత్తం పామిడి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకొని వచ్చారు. మృతునికి భార్య సుజాత, కుమార్తెలు కీర్తన,కిరణ్మయికలరు. మృతుడి పార్థివదేహంపై భార్య, ఇద్దరు కుమార్తెలు ఆర్థనాథాలతో మేము ఎలాబతకాలి, మాగతి ఎట్లని విలపించడం చూపరులను కలిసి వేసింది.పోలీసులు కేసు నమోదుచేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

# లీలావతి చారిటబుల్ ట్రస్ట్ వృద్ధాశ్రమం అన్నదానం



**లింగాల - సూర్య వాస్తవం:** లింగాల మండలం ఇప్పట్ల వద్ద ఉన్నలీలావతి చారిటబుల్ ట్రస్ట్ వృద్ధాశ్రమం నందు దివంగత వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నేత డాక్టర్ అభిషేక రెడ్డి 38వ జయంతి సందర్భంగా సోమవారండాక్టర్ అభిషేక్ రెడ్డి సతీమణి డాక్టర్ సౌఖ్య రెడ్డి , వై. ఎస్ మదన్ మోహన్ రెడ్డి,వై. ఎస్. ఆర్ సి పి నాయకులు, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ చిన్నప్ప ,చంద్రమౌళి, కనక, సేమీవుల్లా ఆధ్వర్యంలో వృద్దులకు అన్నదానం ఏర్పాటు చేయడం జరిగింది.నగరిగుట్ట నిరాశ్రుల ఆశ్రమం నందు నాగరాజు, బాబు, ఆధ్వర్యంలో అనాధలకు అన్నదానం చేశారు.స్థానిక వీర నారాయణ మ్మ అందుల ఆశ్రమం నందు రామలక్ష్మణ్ రెడ్డి, మహేష్ రెడ్డి, రాజేష్, ప్రదీప్ ఆధ్వర్యంలో అందులకు అన్నదానం ఏర్పాటు చేయడమైనది.పై కార్యక్రమాలలో బూత్ కమిటీ రాష్ట్ర కార్యదర్శి చంద్రమౌళి, కనక, స మీవుల్లా, నాగరాజు, సంపత్, శ్రీ రాములు, మోటా రాజా, గంగ రాజు, నట్టు శేఖర్, చందు, లక్ష్మి నారాయణ రెడ్డి, రఫీ, రామ్ లక్ష్మణ్, ప్రదీప్, రాజేష్,చాను, మహేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### మురిడి ఆంజనేయ స్వామి హుండీ లెక్కింపు

# 9 నెలలకు 11, 49,851 ఆదాయం

### దేవాదాయ శాఖ అధికారి ఆధ్వర్యంలో లెక్కింపు



**రాయదుర్గం - సూర్య వాస్తవం :** మురిడి ఆంజనేయస్వామి ఆలయం ఉండి లెక్కింపు తొమ్మిది నెలలకు గాను 11 లక్షల 49 వేల ఎనిమిది వందల యాభై నాలుగు రూపాయలు ఆదాయం వచ్చినట్లు ఎండోమెంట్ అధికారి నరసింహారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఎండోమెంట్ అధికారి నరసింహారెడ్డి మాట్లాడుతూ... మురిడి ఆంజనేయ స్వామి ఆలయంలో సోమవారం ఆలయ కమిటీ సభ్యులు గ్రామ పెద్దల సమక్షంలో లెక్కింపు జరిగినట్లు ఎండోమెంట్ అధికారి పేర్కొన్నారు. దాదాపుగా 9 నెలల నుండి 11,49,854 ఆదాయం రావడం గర్వకారణం అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు తలారి గంగాధర్ మాజీ సర్పంచ్ గంగప్ప ఎస్సై గురునాథ్ రెడ్డి హెడ్ కానిస్టేబుల్ గంగాన పంచాయతీరాజ్ కార్యదర్శి సోమనాథ్ రెవెన్యూ సిబ్బంది దేవాదాయ శాఖ సిబ్బంది జితేందర్ రామాంజనేయులు అర్చకులు పవన్ రామాంజనేయ తదితరులు పాల్గొన్నారు.

### ప్రజా సమస్యల పరిష్కారమే

# ప్రభుత్వ లక్ష్యం: ఆర్థికమంత్రి పయ్యావుల

### కౌకుంట్ల గ్రామంలో 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక': వినతులు స్వీకరించిన ఆర్థిక మంత్రి



**ఉరవకొండ - సూర్య వాస్తవం:** ఉరవకొండ మండలం కౌకుంట్ల గ్రామంలో రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజల నుంచి నేరుగా వినతులు స్వీకరించి, వారి సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ప్రజల సమస్యల పరిష్కారానికి అత్యున్నత ప్రాధాన్యం ఇస్తోంది.ప్రజలకు ఆలస్యం లేకుండా న్యాయం జరిగేలా చూడటమే ప్రభుత్వ ప్రధాన బాధ్యత. ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి "ప్రజా సమస్యల పరిష్కార వేదిక " కార్యక్రమాలను క్రమం తప్పకుండా నిర్వహిస్తూ, ప్రజలకు చేరువగా ఉంటున్నాం. గ్రామీణ ప్రాంతాల నుండి వచ్చిన ప్రతి అర్జీని సంబంధిత అధికారులకు పంపించి, వాటి పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. ?ఈ కార్యక్రమానికి వివిధ గ్రామాల నుండి ప్రజలు, స్థానిక ప్రజాప్రతినిధులు మరియు అధికారులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. తమ సమస్యలపై మంత్రికి నేరుగా వినతి పత్రాలను అందజేశారు. ప్రజల నుంచి అందిన ప్రతి దరఖాస్తుపై వేగంగా స్పందిస్తామని మంత్రి ఈ సందర్భంగా భరోసా ఇచ్చారు.

### దళితుని భూమి పై

# కన్నేసిన వారిపై చర్యలకు డిమాండ్





**చాపాడు సూర్య వాస్తవం:** కడప జిల్లా చాపాడు మండలం బద్రిపల్లె కు చెందిన మాల కులానికి చెందిన దేగల ఆశీర్వాదం భూమి పై కన్నేసిన వారిపై చర్యలు తీసుకోవాలని మాల మహానాడు జి చెన్నయ్య వర్గం, కడప జిల్లా అధ్యక్షులు జేష్టది భాస్కర్ డిమాండ్ చేశారు. సోమవారం తన వర్గం సభ్యులతో చాపాడు తహశీల్దార్ రామ కమారి ని గౌరవప్రదంగా కలిశారు. బద్రి పల్లెలో దేగల ఆశీర్వాదం కు చెందిన సుమారు రెండు ఎకరాల పై చిలుకు భూమిని ఇటీవల కాలువ గుర్రప్ప పేరుతో రిజిస్ట్రేషన్ చేయడాన్ని తహశీల్దార్ దృష్టికి తీసుకెళ్లారు. ఇందుకు తహశీల్దార్ తన ప్రమేయం లేదని సంబంధిత పత్రాలతో పాటు కోర్టు ఇంజెక్షన్ ఆర్డర్ కాపీ తో రిజిస్ట్రేషన్ రద్దు కోసం ప్రయత్నించ వచ్చని సూచించారు. అనంతరం జేష్టాది భాస్కర్ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ 2012 మార్చి 3 వ తేదీన దేగల ప్రభుదానము కాల్వ గురప్ప కి ఆయికం రిజిస్టరు, మూడు సంవత్సరాల కాల వ్యవధికి చేయించారని తెలిపారు. మూడు నెలలు గడువు ఉండగా, తీసుకున్న డబ్బు ఇవ్వడానికి వెళితే, రివర్స్ అయి, భూమి ఆక్రమించుకోవాలని, చూస్తున్న కాల్వ గుర్రప్ప, రాజకీయంగా అధికారుల అండదండలతో రిజిస్ట్రేషన్ పత్రాలు ఇవ్వకుండా నానా తిప్పలు పెడుతూ ఉండడం, దళితులు ఏం చేస్తారులే నాకు అధికార బలం ఉంది డబ్బు బలం ఉంది అని, మొత్తానికి ఆన్లైన్ ఎక్కించుకున్నారని తెలిపారు. విలువ గల భూమి మీద కన్నేశాడని దీంతో బాధితులు కోర్టులో ఇంజక్షన్ ఆర్డర్ తెచ్చుకున్నారని వివరించారు. కోర్టు పెండింగ్ లో ఉన్న చుక్కల భూమిని, వీఆర్వో, ఆర్ ఐ ఎమ్మార్వో, లు ఆన్ లైన్ లో ఎలా ఎక్కిస్తారని వివరణ కోరగా, తాసిల్దార్ ఇంజక్షన్ ఆర్డర్ తీస్తే, ఆన్లైన్ తీసేస్తామని, వివరణ ఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బాధితులు దేగల ఆశీర్వాదం, ఆశీర్వాదం భార్య కుమారుడు కడప జిల్లా మాల మహానాడు యువజన సంఘం అధ్యక్షులు రాజేష్, జమ్మలమడుగు నియోజకవర్గ అధ్యక్షులు రాజశేఖర్, ప్రొద్దుటూరు యూత్ ప్రెసిడెంట్, జాస్వర్, శరబుద్దిన్, వల్లి, తదితరులు పాల్గొన్నారు.

### ప్రభుత్వ భూమిలో

# అక్రమంగా నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు

## - తహసిల్దార్ రెడ్డి శేఖర్



**కదిరి సూర్య వాస్తవం:** కదిరి మున్సిపల్ పరిధిలోని ప్రభుత్వ భూములలో అక్రమంగా నిర్మాణ చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని తహసిల్దార్ రెడ్డి శేఖర్ హెచ్చరించారు. ఈ సందర్భంగా తహసిల్దార్ మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలో అక్రమంగా నిర్మించిన అక్రమ నిర్మాణాలను శ్రీ సత్య సాయి జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్ ఆదేశాల మేరకు తొలగిస్తామన్నారు.సర్వేనెంబర్ 83 లో ఆక్రమణలపై గతంలో చాలా ఫిర్యాదులు రావడంతో సర్వే చేయిస్తున్నామని ఒక వారం రోజుల్లో సర్వే పూర్తి అవ్వగానేఅక్రమ దారులను గుర్తించి తగిన చర్యలు తీసుకుంటామని తహ సిల్దార్ పేర్కొన్నారు.కదిరి మున్సిపాలిటీలోని కదిరి గ్రామ పొలం సర్వే నెం.83 లో ఆక్రమదారులు అక్రమంగా ఇళ్ళ నిర్మాణం మరియు బేస్ మట్టాల నిర్మాణం జరుగుతున్నాయని గతములోనే ఫిర్యాదు రాగానే, మేము ఆ సర్వే నెం 83 ను క్షేత్ర స్థాయిలో పరిశీలించామన్నారు. అక్కడక్కడ కొంత మంది ఆక్రమాదారులు అనధికారికంగా బేస్ మట్టాలను వేశారని.. మరియు వాటిని మా సంరక్షణలోకి తీసుకొని విచారణ చేస్తున్నట్లు తహసిల్దార్ రెడ్డి శేఖర్ తెలిపారు. అదేవిధంగా సర్వే నెం.83 లో ఎంత విస్తీర్ణంలో అసైన్మెంట్ ఇచ్చాం..? మరియు ఎంత మందికి ఇంటి పట్టాలు ఇచ్చాం..? మిగిలిన ప్రభుత్వ భూమి ఎంత ఉంది అనే విషయం పై సర్వే చేయిస్తున్నామని తెలిపారు . అనంతరం పూర్తి వివరాలను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి కలెక్టర్ ఆదేశాల మేరకు అక్రమ కట్టడాల పై చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.ప్రజలు కూడా ప్రభుత్వ భూములలో లే ఔట్ వేసిన ఇంటి జాగలను కానీ ఇళ్లను కానీ కొనకూడదు విక్రయించకూడదని అలా లావాదేవీలు చేసిన వారిపై చట్ట రీత్యా చర్యలు తీసుకుంటామన్నారు.

### డీలర్ల సమస్యలపై కేంద్రం నిర్లక్ష్యం

# ఉరవకొండలో మిన్నంటిన నిరసన

### స్వచ్ఛందంగా బంద్ నిరసన తెలుపుతున్న ఎరువుల డీలర్లు



**ఉరవకొండ - సూర్య వాస్తవం:** స్థానిక మండల కేంద్రంలో ఎరువులు, పెస్టిసైడ్స్ మరియు విత్తనాల డీలర్ల సమస్యలపై కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి నిరసనగా సోమవారం నిర్వహించిన దేశవ్యాప్త భారత్ బంద్‌కు ఉరవకొండలో విశేష స్పందన లభించింది. బంద్‌కు మద్దతుగా స్థానిక డీలర్లు స్వచ్ఛందంగా తమ వ్యాపార సంస్థలను మూసివేసి ఐక్యతను చాటిచెప్పారు. ఈ సందర్భంగా డీలర్లు ఐక్యంగా నిలబడి శాంతియుతంగా నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. తమకు ఎదురవుతున్న సమస్యలను పరిష్కరించేందుకు కేంద్ర ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని గట్టిగా డిమాండ్ చేశారు. బంద్ నేపథ్యంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కార్యక్రమం ప్రశాంత వాతావరణంలో కొనసాగింది.జిల్లా అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ ఎం. గంగాధర్ మాట్లాడుతూ, ఎరువులు, విత్తనాల డీలర్లు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం వాటిపై స్పందించకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం వెంటనే చొరవ చూపాలని ఆయన కోరారు. ఈ నిరసన కార్యక్రమంలో సీనియర్ డీలర్లు త్రివేణి భీమన్న, మోహన్, మస్తాన్ వలి, నాగమల్లి ఓబులేసు, భద్రి తదితరులు పాల్గొన్నారు. ఫెర్టిలైజర్స్, పెస్టిసైడ్స్ మరియు విత్తన డీలర్ల అసోసియేషన్ సభ్యులు పెద్ద సంఖ్యలో హాజరై బంద్ విజయవంతం చేశారు.

# ఉరవకొండలో పెట్రోల్ సెగ: గంటల తరబడి క్యూలైన్లలో వాహనదారులు!



**ఉరవకొండ - సూర్య వాస్తవం:** స్థానిక పెట్రోల్ బంకుల వద్ద నెలకొన్న ఈ పరిస్థితి వాహనదారులకు నిజంగానే పెద్ద ఇబ్బంది. సాధారణంగా ఇలాంటి రద్దీ ఏర్పడినప్పుడు ఎదురయ్యే ప్రధాన సమస్యలు మరియు ఈ పరిస్థితిని చక్కదిద్దడానికి అధికారులు ప్రయత్నించాలి. ?గంటల తరబడి క్యూలో నిలబడటం వల్ల ఉద్యోగస్తులు, వ్యాపారులు తమ విధులకు సకాలంలో వెళ్లలేక ఇబ్బందులు పడుతున్నారు. మెడికల్ ఎమర్జెన్సీ లేదా ఇతర అత్యవసర పనుల మీద వెళ్లే వారికి ఇంధనం దొరకకపోవడం ఆందోళన కలిగించే విషయం.?అదనపు నిల్వ అవసరానికి మించి ఇంధనాన్ని నింపుకోవడం వల్ల స్టాక్ త్వరగా అయిపోయి, నిజంగా అవసరమైన వారికి దొరక్కుండా పోతుంది. ?బంకుల వద్ద తోపులాట జరగకుండా పోలీసులు లేదా బంక్ సిబ్బంది క్యూ లైన్లను క్రమబద్ధీకరించడం ముఖ్యం. రద్దీ తగ్గే వరకు ఒక్కో వాహనానికి ఇంత మొత్తంలోనే ఇంధనం పోయాలనే నిబంధన పెడితే అందరికీ అందుబాటులో ఉండే అవకాశం ఉంటుంది.?ఇంధన సరఫరా ఎప్పటికి పునరుద్ధరించబడుతుందో సంబంధిత అధికారులు క్లారిటీ ఇస్తే ప్రజల్లో ఉన్న ఆందోళన తగ్గుతుంది. ఈ విషయంపై స్పందించిన తహసీల్దార్ ఉరవకొండ మండలం తహశీల్దార్ భోగన్న గౌడ్ మీడియా తో మాట్లాడుతూ సోషల్ మీడియాలో వస్తున్న ఇంధన కొరత వార్తలపై స్పందించారు. ఆయన స్వయంగా పలు పెట్రోల్ బంకులను తనిఖీ చేసి, నిల్వలను పరిశీలించారు.ఎక్కడా ఇంధన కొరత లేదని, అన్ని బంకుల్లో తగినంత స్టాక్ అందుబాటులో ఉందని ఆయన స్పష్టం చేశారు.పెట్రోల్, డీజిల్ సరఫరా నిరంతరాయంగా కొనసాగుతోంది. అధికారులు నిరంతరం పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు, ఏదైనా సమస్య ఉంటే వెంటనే పరిష్కరిస్తారు. ప్రజలు అనవసరంగా ఆందోళన చెంది ఇంధనాన్ని నిల్వ చేసుకోవద్దని, యథావిధిగా వాహనాలను వాడుకోవచ్చని భరోసా ఇచ్చారు.

# గొప్ప ప్రతిభావంతులతో కలిసి పని చేశాను



సాయి పల్లవి, ఆమిర్ ఖాన్ కుమారుడు జునైద్ ఖాన్ నటించిన 'ఏక్ దిన్' చిత్రం తెలుగులో 'ఒక రోజు' పేరుతో మే 1న విడుదల చేస్తున్నారు. ఈ సినిమాను సునీల్ పాండే తెరకెక్కించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమంలో సాయిపల్లవి మాట్లాడారు. 'ఎన్ని మంచి సినిమాల్లో నటించానో నాకు తెలియదు. కానీ, గొప్ప ప్రతిభావంతులతో కలిసి పని చేశానని మాత్రం చెప్పగలను. అలాంటి వారి మధ్య ఉండడం నాకు ఆనందంగా ఉంది. కెరీర్‌లో ఇక్కడివరకు వచ్చానంటే అది నా అదృష్టంగా భావిస్తున్నా. ఈ సినిమా చూసి ఆమిర్‌ఖాన్ అందరి ముందూ ఎమోషనల్ అయ్యారు. అలా భావోద్వేగానికి గురవ్వాలన్నా ధైర్యం కావాలి. నేను అలా అందరిలో ఎమోషనల్ కాలేను. సినిమా చూస్తున్నప్పుడు ఈ లైట్స్ కొంచెంసేపు ఆగిపోతే బాగుండు అని కోరుకున్నా. ఎందుకంటే నాకు కూడా కన్నీళ్లు వచ్చాయి. కంట్రోల్ చేసుకున్నా' అని చెప్పారు. జునైద్ మంచి సహనటుడని కూడా సాయి పల్లవి అన్నారు. ఇది బాలీవుడ్‌లో తన తొలి చిత్రమని.. హిందీ మాట్లాడడానికి ప్రయత్నిస్తున్నట్లు చెప్పారు. ఈ సినిమాకు అమిర్‌ఖాన్ నిర్మాతగా వ్యవహరించారు. 'దర్శకుడు ఈ సినిమా కోసం చాలా కష్టపడ్డారు. విజయం సాధిస్తుందో, లేదో ఎవరికీ తెలియదు. కానీ, మనం కథకు ప్రాణం పోసి చూపించగలిగామా లేదా అన్నదే నాకు ముఖ్యమైన విషయం. నా దృష్టిలో విజయానికి అదే మొదటి కొలమానం.' అని ఆమిర్ అన్నారు.

# బ్లాక్ గోల్డ్ షూటింగ్ పూర్తి



నటి సంయుక్త మీనన్ ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రం 'ది బ్లాక్ గోల్డ్'. యోగేష్ కెఎంసి దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాను హాస్య మూవీస్ బ్యానర్‌పై రాజేష్ దండా నిర్మిస్తున్నారు.

సామ్ సిఎస్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు. ఈ సినిమాలో సంయుక్త మీనన్ పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్ పాత్రలో కనిపించనున్నారు.

ఈ సినిమా ఆఖరి షెడ్యూల్ తాజాగా పూర్తయినట్లుగా మూవీ యూనిట్ ప్రకటించింది. సినిమాను త్వరలోనే వేసవికానుకగా విడుదల చేసే ఆలోచనలో నిర్మాతలు ఉన్నారు.

# విశాల్ 'మకుటం'లో హీరోయిన్‌గా అంజలి



సూపర్ గుడ్ ఫిల్మ్స్ బ్యానర్‌లో 99వ సినిమాగా ఆర్.బి. చౌదరి నిర్మానంలో విశాల్ స్వీయ దర్శకత్వంలో రానున్న చిత్రం 'మకుటం'.

ఇప్పటి వరకు వచ్చిన కంటెంట్, పోస్టర్లు చూస్తే ఇదొక డిఫరెంట్ యాక్షన్ సినిమా అని అర్థం అవుతోంది. తాజాగా ఈ మూవీకి సంబంధించిన మరో అప్డేట్ ఇచ్చారు. విశాల్, అంజలి కాంబోకి ఉన్న హిట్స్, క్రేజ్ అందరికీ తెలిసిందే. అయితే ఈ 'మకుటం' చిత్రంలోనూ విశాల్ సరసన అంజలి నటించనున్నారు. ఈ మేరకు అంజలి, విశాల్ కలిసి ఓ కాన్సెప్ట్ వీడియోని చేశారు.

హీరోయిన్ అంజలి వద్దకు దర్శకుడైన విశాల్ కథ చెప్పడానికి వెళ్తాడు. ఇక కథ చెప్పండి డైరెక్టర్ గారు అని అంజలి అంటారు. ఒక అందమైన గ్రామం అని విశాల్ అంటే.. అది ప్రొడక్షన్ వాళ్లు చూసుకుంటారు కదా.. ముందు మీరు కథ చెప్పండని కౌంటర్ వేస్తారు అంజలి. ఇలా విశాల్ కథ చెబుతూ ఉంటే మధ్య మధ్యలో అంజలి సెటైర్లు వేస్తుంటారు. విశాల్ ఇలా ఏదేదో చెబుతుంటారు.. అసలు మీ వద్ద కథ ఉందా? అని అంజలి అడగడంతో విశాల్ పారిపోతారు. మంచి కథ అని మేనేజర్ చెప్పారే.. విశాల్ ఏంటి ఇలా చెబుతున్నారని అంజలి అనుకుంటారు. కథ అడుగుతోందే.. ఎలా.. రేపు వచ్చి మరో కథ చెబుదాం అని విశాల్ వెళ్లిపోతారు.

ఈ కాన్సెప్ట్ వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతోంది.

ఈ మూవీకి జీవీ ప్రకాష్ కుమార్ సంగీతాన్ని



# ఢిల్లీ ఢమాల్

- భువనేశ్వర్, హేజిల్ వుడ్ దెబ్బ
- 8 పరుగులకే 6వికెట్లు కోల్పోయిన క్యాపిటల్స్
- 6.3ఓవర్లలోనే లక్ష్యాన్ని ఛేదించిన బెంగళూరు




**న్యూఢిల్లీ:** అరుణ్ జైట్లీ స్టేడియంలో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు(ఆర్సీబీ) పేసర్లు నిప్పులు చెరిగే బౌలింగ్ తో మెరిసారు. సీనియర్ పేసర్లు భువనేశ్వర్(3/5), హేజిల్‌వుడ్(3/6) రాణించడం తో ఢిల్లీ క్యాపిటల్స్ కేవలం 8 పరుగులకే 6 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. ఆ తర్వాత అభిషేక్ పోరెల్(30), డేవిడ్ మిల్లర్(19), జేమీసన్(12) రాణించడంతో ఢిల్లీ జట్టు 75పరు గులకే కుప్పకూలింది. ఆ లక్ష్యాన్ని బెంగళూరు 6.3ఓవర్లలో కేవలం ఒక వికెట్ కోల్పోయి సునాయాసంగా ఛేదించింది. బేథెల్(20), కోహ్లి(23నాటౌట్), పడిక్కల్(34) మరో వికెట్ పడకుండా మ్యాచ్ ను ముగించారు.దీంతో బెంగ ళూరు జట్టు 9వికెట్ల తేడాతో ఢిల్లీ ఓడించింది. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ హేజిల్ వుడ్ కు దక్కింది.

తొలుత ఢిల్లీ ఓపెనర్ సహిల్ పరాఖ్(0)ను భువనేశ్వర్ తొలి బంతికే బౌల్డ్ చేయగా.. ఆ తర్వాతి హేజిల్‌వుడ్ మొదటి రెండు బంతుల్లో కేఎల్ రాహుల్(1), సమీర్ రిజ్వీ(0)లను ఔట్ చేసి హ్యాట్రిక్‌పై నిలిచాడు. ట్రిస్టన్ స్టబ్స్(5)వికెట్ కాపాడుకున్నా భువనేశ్వర్‌కు దొరికిపోయాడు. ఆ షాక్ నుంచి తేరుకునేలోపే అక్షర్ పటేల్(0), నితీశ్ రాణా(1)ను హేజిల్‌వుడ్ వెనక్కి పంపాడు. దీంతో 8పరుగులకే ఆరో వికెట్ పడింది. ఢిల్లీ బ్యాటర్లలో అభిషేక్ పొరెల్(30) టాప్ స్కోరర్. డేవిడ్ మిల్లర్ (19), కైల్ జేమీసన్ (12)పరుగులు చేశారు. మిగతా బ్యాటర్లు ఇలా వచ్చి అలా వెళ్లిపోయారు. రసిఖ్ సలామ్, సుయాశ్ శర్మ, కృనాల్ పాండ్య ఒక్కో వికెట్ పడగొట్టారు. పవర్ ప్లే ఆరు ఓవర్లు ముగిసేసరికి ఢిల్లీ స్కోరు 13/6. ఐపీఎల్ చరిత్రలో పవర్ ప్లేలో ఇదే అత్యల్ప స్కోరు. ఢిల్లీ బ్యాటర్లు పెవిలియన్‌కు క్యూ కట్టడంతో ఐపీఎల్‌లో అత్యల్ప స్కోరు చేసిన జట్టుగా చెత్త రికార్డును మూట గట్టుకుంది. 2017లో కేకేఆర్‌తో జరిగిన మ్యాచ్‌లో ఆర్సీబీ 49పరుగులకే ఆలౌటైంది. ఇప్పటివరకు ఇదే లోయెస్ట్ స్కోర్. పవర్ ప్లే తర్వాత డిల్లీ బ్యాటర్లు కాస్త పుంజుకున్నారు. మిల్లర్, అభిషేక్ పొరెల్ ఏడో వికెట్‌కు 31బంతుల్లో35పరుగుల భాగస్వామ్యం నెలకొల్పారు. దీంతో ఢిల్లీ చెత్త రికార్డు నుంచి తప్పించుకుంది. రసిఖ్ సలామ్ వేసిన తొమ్మిదో ఓవర్‌లో మిల్లర్ ఏడో వికెట్‌గా వెనుదిరిగాడు. జేమీసన్‌ను కృనాల్ పాండ్య వికెట్ల ముందు దొరకబుచ్చుకున్నాడు. కుల్‌దీప్(3) సుయాశ్ క్లీన్‌బౌల్డ్ చేశాడు. అభిషేక్ పొరెల్‌ను హేజిల్ వుడ్ ఔట్ చేయడంతో ఢిల్లీ ఆలౌటైంది.

స్కోర్ బోర్డు...

డిల్లీ క్యాపిటల్స్: సాహిల్(బి)భువనేశ్వర్ కుమార్ 0, కెఎల్ రాహుల్ (సి)జితేశ్ శర్మ (బి)హేజిల్ వుడ్ 1, నితీశ్ రాణా (సి)పడిక్కల్(బి)హేజిల్ వుడ్ 1, సమీర్ రిజ్వీ (సి)జితేశ్ శర్మ (సి)జితేశ్ శర్మ (బి)హేజిల్ వుడ్ 0, స్టబ్స్(సి)పడిక్కల్(బి) భువనేశ్వర్ కుమార్ 5,అక్షర్ పటేల్ (సి)జితేశ్ శర్మ (బి)భువనేశ్వర్ కుమార్ 0, అభిషేక్ పోరెల్ (బి)హేజిల్ వుడ్ 30, డేవిడ్ మిల్లర్ (సి)జితేశ్ శర్మ (బి)సలామ్ దర్ 19, జేమీసన్ (ఎల్బీ)కృనాల్ పాండ్యా 12, కుల్దీప్ యాదవ్ (బి)సుయాశ్ శర్మ 3, ఛమీరా(నాటౌట్) 0, అదనం4. (16.3ఓవర్లలో ఆలౌట్) 75 పరుగులు.

వికెట్ల పతనం: 1/0, 2/2, 3/3, 4/7, 5/7, 6/8, 7/43, 8/62, 9/71, 10/75

బౌలింగ్: భువనేశ్వర్ కుమార్ 3-0-5-3, హేజిల్ వుడ్ 3.3-0-12-4, సలామ్ ధర్ 2-0-21-1, షెఫర్డ్2-0-1-7-1,కృనాల్ పాండ్యా 2-0-9-1.

బెంగళూరు: బేథెల్ (సి)నటరాజన్ (బి) జేమీసన్20, కోహ్లి(నాటౌట్) 23, పడిక్కల్ (నాటౌట్) 34. (6.3ఓవర్లలో వికెట్ నష్టానికి) 77 పరుగులు వికెట్ల పతనం: 1/26

బౌలింగ్: జేమీసన్3-0-42-1, ఛమీరా 2-0-18-0, అక్షర్ పటేల్ 1-0-5-0, నటరాజన్0.3-0-12-0.



## చివరి టి20లోనూ నిరాశే..

- దక్షిణాఫ్రికా మహిళల చేతిలో 23 పరుగుల తేడాతో ఓటమి
- 4-1తో సిరీస్ ను చేజార్చుకున్న టీమిండియా

భారత మహిళ జట్టు దక్షిణాఫ్రికా పర్యటనలో ఆశించిన స్థాయిలో రాణించలేకపోయింది. ఈ మ్యాచ్ కు ముందే సిరీస్ ను చేజార్చుకున్న హర్మన్ ప్రీత్ సేన.. సోమవారం జరిగిన ఐదో, చివరి టి20లో 23 పరుగుల తేడాతో దక్షిణాఫ్రికా మహిళల చేతిలో ఓడింది.

దీంతో ఐదు టి20ల సిరీస్ ను భారత్ 1-4తో చేజార్చుకుంది. బెనోరు వేదికగా సోమవారం జరిగిన ఐదో వన్డేలో టాస్ గెలిచి బ్యాటింగ్ కు దిగిన దక్షిణాఫ్రికా మహిళలజట్టు నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 155 పరుగులు చేసింది. కెప్టెన్, ఓపెనర్ వోల్వార్ట్ 92(నాటౌట్) బ్యాటింగ్ లో రాణించింది. లూస్ తో కలిసి తొలి వికెట్ కు 75 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పింది. ఆ తర్వాత బ్రిట్స్(2), డెర్క్ సెన్(0), బోట్చ్ (8) నిరాశపరిచినా.. ట్రయాన్(12), జోఫ్తా(16నాటౌట్) రాణించారు.

భారత బౌలర్లు దీప్తి శర్మ, శ్రీచరణి, రేణుకకు రెండేసి వికెట్లు దక్కాయి. అనంతరం భారతజట్టు నిర్ణీత ఓవర్లు ముగిసేసరికి 8వికెట్ల నష్టానికి 132 పరుగులు చేసింది. ఫుల్మాలీ(40), రీచా(25నాటౌట్), హర్మన్ ప్రీత్(22) మాత్రమే బ్యాటింగ్ లో రాణించారు. దక్షిణాఫ్రికా బౌలర్లు మాబా, డి-క్లార్క్ కు రెండేసి, మార్, ట్రయాన్, ఖాకాకు ఒక్కో వికెట్ల దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్, సిరీస్ వోల్వార్ట్ కు దక్కాయి. జొహన్నెస్ బర్గ్ వేదికగా జరిగిన నాల్గో టి20లో మాత్రమే టీమిండియా గెలుపొందింది.

## మంత్రి కొల్లు రవీంద్రను మర్యాదపూర్వకంగా కలిసిన గోపాలకృష్ణ

**- మచిలీపట్నం కార్యక్రమంలో శుభాకాంక్షలు తెలిపిన పీఏసీఎస్ డైరెక్టర్**



**పెళ్లకూరు –సూర్య వాస్తవం :**తిరుపతి జిల్లా పెళ్లకూరు మండలం చిల్లకూరు పీఏసీఎస్ డైరెక్టర్ గోపాలకృష్ణ రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్రను మర్యాదపూర్వకంగా కలిశారు. మచిలీపట్నంలో నిర్వహించిన ఓ కార్యక్రమానికి హాజరైన సందర్భంగా, మంత్రి కొల్లు రవీంద్రను కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా గోపాలకృష్ణ మంత్రి గారితో పలు విషయాలపై సౌహార్ధపూర్వకంగా మాట్లాడినట్లు సమాచారం. వీరి వెంట నాయుడుపేట పట్టణ ఐటీడీపీ అధ్యక్షులు సాయి హేమంత్, పెళ్లకూరు మండల ఐటీడీపీ అధ్యక్షులు దక్కిలి సుమన్, నాయుడుపేట మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు పసల సురేష్, ఓజిలి మండల తెలుగుదేశం పార్టీ నాయకులు కల్లూరు సిద్ధార్థ తదితరులు పాల్గొన్నారు.ఈ సమావేశం సానుకూల వాతావరణంలో సాగినట్లు పార్టీ వర్గాలు పేర్కొన్నాయి.

## పెన్నహోబిలం శ్రీ లక్ష్మీ నరసింహా స్వామి బ్రహ్మోత్సవాలకు సర్వం సిద్ధం

**- రథం ట్రయల్ రన్ విజయవంతం**



**ఉరవకొండ – సూర్య వాస్తవం:** అనంతపురం జిల్లాలోని ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రం పెన్నహోబిలం శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయం బ్రహ్మోత్సవాలకు సిద్ధమవుతోంది. ముఖ్యంగా మే 6న జరగనున్న మహా రథోత్సవం కోసం అధి కారులు పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నారు.నేడు జరిగిన రథం ట్రయల్ రన్ విజయవంతం అయ్యింది.రథోత్సవం రోజున ఎలాంటి సాంకేతిక సమస్యలు తలెత్తకుండా ఉండటానికి సోమవారం అధికారులు ట్రయల్ రన్ నిర్వహించారు.ప్రత్యేక పూజల అనంతరం ట్రాక్టర్ల సాయంతో రథాన్ని లాగి, దాని పటిష్టతను పరీక్షించారు. రథం చక్రాల స్థితిగతులు, బ్రేకింగ్ వ్యవస్థ, మరియు లాగే తాడు నాణ్యతను క్షుణ్ణంగా తనిఖీ చేశారు.ఫిట్నెస్ సర్టిఫికేషన్: ఆర్ అండ్ బి శాఖ ఇంజనీర్ నాగభూషణం రథాన్ని సమీక్షించి, దేవదాయ శాఖ అధికారులకు తగిన సూచనలు జారీ చేశారు. ముఖ్య అతిథులు మరియు అధికారులుఈ కార్యక్రమంలో ఆలయ, పోలీస్ యంత్రాంగం చురుగ్గా పాల్గొంది: రమేష్ బాబు: ఆలయ కార్యనిర్వాహణ అధికారి ఉరవకొండ ఎస్సై జనార్ధన్ నాయుడు పర్యవేక్షణలో ద్వారకా నాథాచార్యులు ఆలయ ప్రధాన అర్చకులు వీరితో పాటు దేవాలయ పాలకమండలి సభ్యులు మరియు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.భక్తుల సౌకర్యార్థం భద్రతా చర్యలు మే 6న రథోత్సవానికి భారీగా జనం వచ్చే అవకాశం ఉన్నందున, అధికారులు పెన్నహోబిలం వైపు వచ్చే వాహనాల కోసం ప్రత్యేక రూట్ మ్యాప్, తోపులాటలు జరగకుండా బారికేడ్ల ఏర్పాటు, ఎండ తీవ్రత దృష్ట్యా తాగునీరు మరియు ఇతర మౌలిక వసతుల కల్పన.భక్తులకి ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయనున్నారు. నరసింహ స్వామి భక్తులందరూ ఈ వేడుకను ప్రశాంతంగా, భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని అధికారులు కోరుతున్నారు.

## మహిళలు చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలి

**- సిఐ చాంద్ బాషా**



సూర్య వాస్తవం చెన్నూరు, ఏప్రిల్ 27: మహిళలు తమ హక్కులు, చట్టాలపై అవగాహన పెంపొందించుకోవడం అత్యవసరమని సిఐ చాంద్ బాషా అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన 'స్త్రీ శక్తి' అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు."నేరం జరిగిన తర్వాత స్పందించడం కంటే, ముందస్తుగా జాగ్రత్తలు తీసుకుని నేరాలను నివారించడం చాలా ముఖ్యమైంది. మహిళలు చట్టాలపై అవగాహన పెంపొందించుకుంటేనే భద్రతాభావం పెరుగుతుంది" అని సిఐ చాంద్ బాషా తెలిపారు."మహిళలపై గృహహింస, వరకట్న వేధింపుల కేసుల్లో 181 హెల్ప్‌లైన్‌కు, చిన్నారులపై లైంగిక వేధింపుల సందర్భాల్లో 1098 నంబర్‌కు ఫోన్ చేస్తే పోలీసులు వెంటనే స్పందిస్తారు. సమాజ భద్రతలో మహిళల సహకారం కూడా కీలకం" అని పేర్కొన్నారు.అలాగే గంజాయి, మట్కా, జూదం వంటి సంఘ వ్యతిరేక కార్యకలాపాలపై సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు. "మహిళలు కుటుంబంలోనే కాకుండా సమాజంలో కూడా బాధ్యతాయుతంగా వ్యవహరిస్తే నేరాలను తగ్గించవచ్చు" అని అన్నారు.తహసీల్దార్ విజయకుమారి మాట్లాడుతూ, "గ్రామీణ ప్రాంతాల్లో మహిళలకు చట్టాలపై మరింత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది" అన్నారు. టీఎస్పీయూ అధ్యక్షుడు ఓబులేసు మాట్లాడుతూ, "మహిళలు ధైర్యంగా సమస్యలను ఎదుర్కొని జీవితాన్ని సవాలుగా స్వీకరించాలి. అమ్మాయిలను అబ్బాయిలతో సమానంగా ధైర్యంగా పెంచాలి" అని సూచించారు. ఈ కార్యక్రమంలో కడప మహిళా పోలీస్ స్టేషన్ ఎస్సై శ్రీనివాసులు, ఎంపీడీవో ప్రసాద్, టిడిపి మండల అధ్యక్షుడు కల్లూరు విజయభాస్కర్ రెడ్డి, అంగన్వాడీ సిబ్బంది, సచివాలయ సిబ్బంది, మహిళా పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

# అశేష జనవాహిని భక్త సందోహం మధ్య

# బ్రహ్మరథంపై ఊరేగిన వీరబ్రహ్మేంద్రస్వామి

- జన సంద్రోహరంగా మారిన బ్రహ్మంగారిమఠం
- జై వీర బ్రహ్మ జై గోవిందమాంబజై నామస్మరణతో మారు మోగిన పురవీధులు



**బ్రహ్మంగారిమఠం –సూర్య వాస్తవం :**కాలజ్ఞాన సృష్టికర్త జగద్గురు శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వాముల వారి 333వ ఆరాధన గురు పూజ మహోత్సవాలు అంగరంగ వైభవంగా కన్నుల కాంతులుగా విద్యుత్ దీప అలంకరణతో భక్తుల కోలాహలం మధ్య చూసినవారికి చూడముచ్చటగా అంగరంగ వైభవంగా జరుగుచున్నవి ఆరాధన గురు పూజ మహోత్సవాల్లో అతి ముఖ్యమైన బ్రహ్మ రథోత్సవం రోజు శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వాముల వారి దర్శనానికి వేలాదిమందిగా భక్త సందోహం తరలి వచ్చారు మఠాధిపతులు శ్రీ వీర ధర్మజ వెంకటాద్రి స్వాముల ఆధ్వర్యంలో మేనేజర్ ఈశ్వరయ్య చారి పర్యవేక్షణలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని సౌకర్యాలను ఏర్పాటు చేశారు స్వామివారి ఆరాధన గురుపూజ మహోత్సవాలకు విచ్చేసిన భక్తులకు నిత్యాన్నదానంతో పాటు చల్లకి మజ్జిగ పానీయాలు చల్లటి నీటిని వివిధ అన్నదాన సత్రాల యాజమాన్యం వారి సంస్థల వారు పంపిణీ చేశారు

**బ్రహ్మ రథానికి మఠాధిపతుల వారు ప్రత్యేక పూజలు**

ఆరాధన గురు పూజ మహోత్సవాల్లో భాగంగా బ్రహ్మ రథోత్సవము రోజున రథం ప్రారంభానికి ముందు మఠాధిపతులు శ్రీ వీరధర్మజ వెంకటాద్రి స్వాములవారు సతి సమేతంగా రథం వద్దకు విచ్చేసి వేదమంత్రోత్సవాలను మధ్య ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి రథాన్ని ప్రారంభించారు అంతకుముందు శ్రీ ఈశ్వరి దేవి మఠం మఠాధిపతులు శ్రీ వీర శివకుమార్ స్వాముల వారు బ్రహ్మ రథానికి వేద పండితుల మంత్రోత్సవాల మధ్య ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు

ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ ప్రత్యేక పూజలు

శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వాముల వారి ఆరాధన గురు పూజ మహోత్సవాలను పురస్కరించుకొని మైదుకూరు శాసనసభ్యులు పుట్టా సుధాకర్ యాదవ్ శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వాములవారి మఠానికి చేరుకొని మొదటిగా శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వాముల వారిని దర్శించుకుని స్వామివారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు అనంతరం బ్రహ్మ రథోత్సవం వద్దకు చేరుకొని బ్రహ్మంగారి ప్రధానికి పూజా కార్యక్రమాలను నిర్వహించి అందరికీ ఆశీర్వచనములు ఎల్లవేళలా ఉండి అందరు సుఖసంతోషాలతో జీవించాలని ఆయన కోరుకున్నారు

కన్నుల పండుగా కదిలిన బ్రహ్మరథం

ఆరాధన గురు పూజ మహోత్సవాల్లో భాగంగా అతి ముఖ్యమైన రెండవ రోజు శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వాముల వారి బ్రహ్మ రథోత్సవం భక్తుల భక్తి భావనతో కన్నుల విందుగా చూడముచ్చటగా స్వామివారి పురవీధుల గుండా జై వీర బ్రహ్మ జై గోవిందమాంబజై నామస్మరణతో వైభవంగా జరిగింది స్వామివారి రథోత్సవం రోజు పోలీస్ వారి పటిష్టమైన బందోబస్తు మధ్య మైదుకూరు డిఎస్పి రాజేంద్రప్రసాద్ సీఐ శివశంకర్ ఎస్ఐ శివప్రసాద్ ఆధ్వర్యంలో పటిష్టమైన పోలీస్ వారి పర్యవేక్షణలో ఎటువంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా వైభవంగా ఈ కార్యక్రమంలో ఆర్డీవో చంద్రమోహన్ దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ శంకర్ బాలాజీ తెలుగుదేశం పార్టీ మండల నాయకులు భక్తులు పురం ప్రజలు పాల్గొన్నారు.





## జిల్లాలో ఇంధన కొరత లేదు వదంతులను నమ్మవద్దు

**- పెట్రోల్ బంకులపై నిరంతర పర్యవేక్షణ**
**- పరిస్థితి పూర్తిగా సాధారణం**
**- జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్**





**అన్నమయ్య బ్యూరో –సూర్య వాస్తవం:**జిల్లాలో ఎక్కడా పెట్రోల్ లేదా డీజిల్ కొరత లేదని, ప్రజలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ తెలిపారు. ఇంధన కొరతపై వ్యాప్తిలో ఉన్న వదంతులను నమ్మవద్దని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు.రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారి సూచనల మేరకు జిల్లాలోని అన్ని పెట్రోల్ బంకుల్లో రెవిన్యూ, పోలీస్ శాఖల అధికారులు సంయుక్తంగా పర్యవేక్షణ నిర్వహిస్తున్నారని కలెక్టర్ తెలిపారు.సోమవారం కలెక్టర్ ఆదేశాల మేరకు సంబంధిత శాఖల అధికారులు జిల్లా నందలి వివిధ ప్రాంతాలు, మండలాల్లోని పెట్రోల్ బంకులను రెవెన్యూ పోలీస్ అధికారులు సంయుక్తంగా పరిశీలించి అక్కడి పరిస్థితిని సమీక్షించారు. ఈ సందర్భంగా ఎలాంటి సమస్యలు లేవని, పొడవైన క్యూలు లేకుండా సాధారణ పరిస్థితి కొనసాగుతున్నట్లు గుర్తించారు.అలాగే మదనపల్లి, గుర్రంకొండ, రెడ్డివారిపల్లి, గాలివీడు తదితర మండలాల్లో సుడిగాలి పర్యటన చేసి పరిస్థితిని సమీక్షించారు. పెట్రోల్ బంకుల్లో ఎలాంటి ఇబ్బందులు లేవని అధికారులు నిర్ధారించారు. ప్రతిచోట కూడా కార్యకలాపాలు సజావుగా కొనసాగుతున్నాయి.అన్ని ప్రాంతాల్లో పరిస్థితి పూర్తిగా సాధారణంగా ఉందని, ఎక్కడా రద్దీ లేదా ఇబ్బందులు లేవని అధికారులు పేర్కొన్నారు. పోలీసులతో కలిసి భద్రతా చర్యలు కూడా సమర్థవంతంగా అమలు చేసినట్లు తెలిపారు. జిల్లాలో పరిస్థితి పూర్తిగా అదుపులో ఉందని, ప్రజలు ఎలాంటి వదంతులను నమ్మకుండా ప్రశాంతంగా ఉండాలని జిల్లా కలెక్టర్ కోరారు.

## ప్రజా సమస్యల పరిష్కార వేదిక అర్జీలను ప్రత్యేక దృష్టి పెట్టి నాణ్యతగా పరిష్కరించాలి

**- జిల్లా జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ శర్మ**



**అన్నమయ్య బ్యూరో –సూర్య వాస్తవం:** మదనపల్లి కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ హాలులో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రసెల్ సిస్టం, పిజిఆర్ఎస్) కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని ఆయా మండలాల నుంచి వివిధ రకాల సమస్యలతో వచ్చిన అర్జీదారుల నుండి జిల్లా జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ శర్మ అర్జీలను స్వీకరించారు.ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ తోపాటు.. మదనపల్లి సబ్ కలెక్టర్ చల్లా కళ్యాణి, డిఆర్ఓ చంద్రశేఖర్ రెడ్డ అర్జీలను స్వీకరించారు.ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ... ప్రజా సమస్యల పరిష్కార వేదిక, రెవెన్యూ క్లినిక్ ల అర్జీల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. అర్జీలను వేగ వంతంగా, నాణ్యతగా పరిష్కరించాలన్నారు. ఎలాంటి పెండింగ్ లేకుండా అర్జీలను పరిష్కరించాలని, గ్రీవెన్స్ పై ఎప్పటికప్పుడు మానిటర్ చేయాలని, ఇందులో ఎలాంటి అలసత్వం ఉండరాదన్నారు. సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. అర్జీలను గడువులోపు అత్యంత నాణ్యతగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం వివిధ సమస్యలతో వచ్చిన ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో వివిధ రకాల సమస్యలపై మొత్తంగా 388 అర్జీలను దరఖాస్తుదారులు సమర్పించారు. ఈ సమస్యలన్నీ నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఎండార్స్ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



PRINTED AND PUBLISHED OWNED BY MOGAL IRSHAD BAIG, ON BEHALF OF IRS PUBLICATIONS ADDRESS : # DOOR NO-4-29-A-19-12-, DONTHI STREET, MADANAPALLI, ANNAMAYYA, CHITTOOR, ANDHRA PRADESH - 517325. CELL : 9948461699 ( ASSOCIATE EDITOR -Mohammad Shafi Ahamad )

## ఎక్కడ చూసినా
# పెట్రోల్,డీజిల్ కొరత
## రాష్ట్రంలో ప్రజాజీవనం
# స్తంభించిపోయింది
## చంద్రబాబు ప్రభుత్వం నిద్రపోతూ ఉంది
## డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి



**వేంపల్లె - సూర్య వాస్తవం:** పెట్రోలు,డీజల్ కొరతలేదని ఒకవైపు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు, అధికారులు చెబుతున్నా మరొకవైపు ఎక్కడ చూసినా పెట్రోల్,డీజిల్ బంకుల వద్ద నో స్టాక్ బోర్డులు దర్శనమిస్తు న్నాయి. చంద్రబాబు ప్రభుత్వం మొద్దు నిద్దర నిద్రపోతోంది అని తులసిరెడ్డి ధ్వజమెత్తారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రజాజీవనం స్తంభించిపోయింది. ప్రయాణాలు నిలిచిపోయాయి. సరుకు రవాణా నిలిచిపోయింది.వ్యవసాయ రంగానికి కావలసిన డీజిల్ లభించడం లేదు. ఆయిల్ కంపెనీలు,కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కుమ్మక్కైనట్లు స్పష్టంగా అర్థం అవుతుంది. పశ్చిమబెంగాల్లో రెండవ దశ ఎన్నికలు పూర్తయిన వెంటనే పెట్రోల్ డీజిల్ ధరలు పెంచేటట్లు కనిపిస్తోంది. అందుకోసమే కంపెనీలు పెట్రోల్ డీజిల్ సరఫరాలో కోత విధిస్తున్నట్లు దానికి పచ్చిమాసియా యుద్ధాన్ని సాకుగా చూపిస్తున్నట్లు అర్థమవుతుంది అని తులసి రెడ్డి విరుచుకుపడ్డారు. స్వర్ణాంధ్ర దేవుడెరుగు,ముందు రాష్ట్రంలో పెట్రోల్, డీజిల్ కొడత లేకుండా చూడాలని తులసి రెడ్డి కూటమి ప్రభుత్వానికి సూచించారు..

### శింగనమల మండల పరిధిలోనీ గ్రామాల్లో
## త్రాగునీటి సమస్యలు వెంటనే పరిష్కరించాలి



తహసీల్దార్‌కు వినతి పత్రం సమర్పించిన బీజేపీ మండల అధ్యక్షుడు బొమ్మన ఓబీ రెడ్డి

**శింగనమల - సూర్య వాస్తవం:** సింగనమల మండల పరిధిలోని పలు గ్రామాలలో నెలకొన్న త్రాగునీటి సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ బీజేపీ మండల అధ్యక్షులు బొమ్మన ఓబీ రెడ్డి సింగనమల తహసీల్దార్ కి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మండలంలోని అనేక గ్రామాల్లో ప్రజలు తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వేసవి తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో అధికారులు తక్షణ చర్యలు తీసుకుని నీటి సరఫరాను మెరుగుపరచాలని కోరారు. చెడిపోయిన బోర్లు మరమ్మతు చేయడం, ట్యాంకర్ల ద్వారా నీరు సరఫరా చేయడం, పైప్‌లైన్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు అందించడం ప్రభుత్వ బాధ్యత అని, సమస్యలు కొనసాగితే బీజేపీ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షులు బొమ్మన ఓబిరెడ్డి తో పాటు గ్రామ కమిటీ అధ్యక్షుడు వెంకటరమణ, బిజెపి నాయకులు, కార్యకర్తలు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

### వాసవి జయంతి సందర్భంగా అమ్మవారికి
## పంచలోహ ప్రభావలినీ పొనుగంటి లోకేష్ మహేష్ బ్రదర్స్ అందజేత



**పామిడి- సూర్య వాస్తవం:** పామిడి పట్టణంలోని శ్రీ కన్యకా పరమేశ్వరి దేవాలయం లో వాసవి జయంతి వేడుకల సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక కానుక అందజేశారు. దేవాలయంలో కొలువై ఉన్న వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి మూల విరాట్‌కు, ఉత్సవ విగ్రహానికి 25 వేల రూపాయలు ఖర్చు పెట్టి పంచలోహాలతో తయారు చేసిన ప్రభావలిని దాతలు పోనుగంటి లోకేష్, పోనుగంటి మహేష్ కుటుంబ సభ్యులు భక్తి శ్రద్ధలతో దేవస్థాన కమిటీకి అందజేశారు. ఈ సందర్భంగా దాత కుటుంబ సభ్యులను దేవాలయ కమిటీ సభ్యులు అభినందిస్తూ, వారి సేవాభావాన్ని ప్రశంసించారు. వాసవి జయంతి సందర్భంగా అమ్మవారికి ఈ ప్రత్యేక కానుక అందించడం ఆనందంగా ఉందని దాతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ సభ్యులు, ఆర్యవైశ్య సంఘ నాయకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.
స్థానిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యం..

### అంకితభావంతో పనిచేసి రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో
## పార్టీ విజయకేతనంఎగురవేయాలి
### చక్రాయపేటలో క్యాడర్‌కు దిశానిర్దేశం చేసిన బీటెక్ రవి.



**చక్రాయ పేట సూర్య వాస్తవం:** చక్రాయపేట మండలం నాగులు గుట్టపల్లెలో ఈరోజు తెలుగుదేశం పార్టీ మండల స్థాయి కార్యకర్తల సమావేశం ఉత్సాహంగా సాగింది. పులివెందుల నియోజకవర్గ ఇన్చార్జి బీటెక్ రవి నేతృత్వంలో జరిగిన ఈ భేటీలో రాబోయే సర్పంచ్, జడ్పిటిసి, ఎంపీటీసీ ఎన్నికలపై సుదీర్ఘంగా చర్చించారు. గ్రామీణ స్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయాలని, కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను,అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని కార్యకర్తలకు ఆయన సూచించారు. క్షేత్రస్థాయిలో అంకితభావంతో పనిచేసి రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ విజయకేతనం ఎగురవేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థి విజయానికి 7 విజయ సోపానాలు
## డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి



**వేంపల్లె - సూర్య వాస్తవం:** పండంటి కాపురానికి 12 సూత్రాలు ఉన్నట్లే విద్యార్థి విజయానికి ఏడు విజయ సోపానాలు ఉన్నాయని రాజ్యసభ మాజీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి అన్నారు. ఆదివారం రాత్రి వేంపల్లి లో శ్రీనివాస హై స్కూల్ 14 వ వార్షికోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి తులసి రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా తులసి రెడ్డి మాట్లాడుతూ అన్ని సంపదల్లోకెల్లా విద్యాసంపద శ్రేష్టమైనది అన్నారు. అటువంటి శ్రేష్టమైన విద్యాధనాన్ని గత 14 సంవత్సరాలుగా వేంపల్లి పరిసర ప్రాంతాల్లో ఉన్న విద్యార్థిని విద్యార్థులకు శ్రీనివాస హై స్కూల్ యాజమాన్యం అందించడం హర్షనీయమన్నారు.

క్రమశిక్షణతో, నైతిక విలువలతో కూడిన విద్యాసంపదను శ్రీనివాస హై స్కూల్ అందిస్తుందన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు శ్రీనివాస హై స్కూల్ ను ప్రోత్సహించాలని తులసి రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ పాఠశాల 25 సంవత్సరాల రజతోత్సవాన్ని,50 సంవత్సరాల స్వర్ణోత్సవాన్ని,60 సంవత్సరాల వజ్రోత్సవాన్ని 70 సంవత్సరాల ప్లాటినం ఉత్సవాన్ని శతాబ్ది ఉత్సవాలను జరుపుకోవాలని ఆకాంక్షించారు. వేసవి సెలవుల్లో విద్యార్థులు ప్రకృతి విద్యను నేర్చుకోవాలని సూచించారు. సూర్యుడు,చంద్రుడు, నక్షత్రాలు,ఆకాశం, భూమి, మన చుట్టూ ఉండే కుక్క,పిల్లి,మేక,ఆవు తదితర జంతుజాలాధులు, కోడి,కాకి తదితర పక్షులు, చీమలు ఇలా ప్రకృతిలో ప్రతి ఒక్కటి గురువుతో సమానమని, ప్రతి దాని నుంచి ఎంతో కొంత నేర్చుకోవచ్చునని వేసవి సెలవుల్లో అటువంటి విద్యను నేర్చుకోవాలని తులసి రెడ్డి విద్యార్థులకు సూచించారు.

పండంటి కాపురానికి 12 సూత్రాలు ఉన్నట్లు విద్యార్థి విజయానికి ఏడు విజయ సోపానాలు ఉన్నాయని తులసి రెడ్డి అన్నారు అవి 1. ఆత్మవిశ్వాసం. 2 అవిశ్రాంత కృషి. 3 ఏకాగ్రత. 4 పవిత్ర భావన. 5 ఉత్సాహం. 6 కాలం విలువ తెలుసుకోవడం. 7. చొరవ. వార్షికోత్సవ కార్యక్రమంలో శ్రీనివాస హై స్కూల్ కరస్పాండెంట్ కేశవులు, డైరెక్టర్లు చంద్రబాబు, చంద్రశేఖ ర్,బాబు, కేశవులు సతీమణి లక్ష్మీకాంతమ్మ, కడప పవన్ విద్యా సంస్థల కరస్పాండెంట్ లెక్కల జోగిరా మిరెడ్డి, కరస్పాండెంట్ కృష్ణారెడ్డి, వేంపల్లి వివేకానంద స్కూల్ కరస్పాండెంట్ రామాంజనేయరెడ్డి, యాంకర్ మహేష్ రాజు, కాంగ్రెస్ నాయకులు అమర్నాథ్ రెడ్డి,ఉత్తన్న,నామా వినయ్, పెద్ద సంఖ్యలో పాఠశాల సిబ్బంది,విద్యార్థిని విద్యార్థులు,వారితల్లిదండ్రులు,వేంపల్లిప్రజలుపాల్గొన్నారు.

# పెట్రోల్, డీజిల్ కొరతపై వస్తున్న వదంతులను నమ్మవద్దు
## - తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్ సుబ్బరాయుడు

**తిరుపతి సూర్య వాస్తవం:** పెట్రోల్, డీజిల్ కొరతపై సోషల్ మీడియాలో వస్తున్న వదంతులను నమ్మవద్దు తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్ సుబ్బారాయుడు అన్నారు. తిరుపతి నగరంలో పెట్రోల్, డీజిల్ కొరతపై వస్తున్న వార్తలపై ఆయన స్పందించారు. ప్రజలందరూ సోషల్ మీడియాలో వస్తున్న అసత్య ప్రచారాలను నమ్మవద్దని ఆయన జిల్లా ప్రజలకు విజ్ఞప్తి చేశారు. జిల్లాలో అవసరానికి సరిపడా ఇంధన నిల్వలు అందుబాటులో ఉన్నాయని, ఎలాంటి కొరతా లేదని స్పష్టం చేశారు.ప్రస్తుతం తిరుపతి పరిధిలో ఉన్న 189 పెట్రోల్ బంకుల్లో కేవలం 26 బంకులు మాత్రమే తాత్కాలికంగా డ్రై అవుట్ అయ్యాయని, వాటికి కూడా సోమవారం మధ్యాహ్నం 3 నుంచి 4 గంటల మధ్యలో ఇంధనం సరఫరా చేయ[illegible] సాయంత్రానికి అన్ని పెట్రోల్ [illegible] పనిచేయనున్నాయని వెల్లడించార[illegible] పెట్రోల్, డీజిల్ నిల్వ చేసుకోవడ[illegible] ఏర్పడి కొన్ని ప్రాంతాల్లో క్యూ[illegible] ప్రజలు తమ అవసరానికి సరిప[illegible] వినియోగించాలని సూచించారు. ఎస్పీ హెచ్చరిస్తూ, సోషల్ [illegible] వదంతులు వ్యాప్తి చేస్తే వారిపై [illegible] తీసుకుని క్రిమినల్ కేసులు [illegible] హెచ్చరించారు. ప్రజలు అప్రమత్త[illegible] సహకరించాలని కోరారు.

**జిల్లాలో అవసరానికి సరిపడా ఇంధన నిల్వలు అందుబాటులో ఉన్నట్లు స్పష్టం చేసిన ఎస్పీ**
**అవసరానికి మించి ఇంధనం తీసుకోవడం వల్ల కృత్రిమ కొరత ఏర్పడుతున్నట్లు గుర్తింపు**
**సోషల్ మీడియాలో వదంతులు వ్యాప్తి చేస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరిక**

## బీసీల సంక్షేమం కోసం
# పార్టీ బలోపేతమే లక్ష్యంగా పనిచేస్తా
## వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా వరప్రసాద్



**పులివెందుల సూర్య వాస్తవం:** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బీసీ విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నియమితులైన మాజీ మునిసిపల్ ఛైర్మన్ వల్లెపు వరప్రసాద్ కి పార్టీ నాయకులు ఘన స్వాగతం పలికారు. సోమవారం నగరిగుట్ట రామాలయం వద్దమాజీ కౌన్సిలర్ సతుపటి వెంకటపతి ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా వరప్రసాద్ ను దుశ్శాలువ గజమాలతో ఘనంగా సత్కరించారు.?ఈ సందర్భంగా సాతుపాటి వెంకటపతిపార్టీ శ్రేణులు కేక్ కట్ చేసి,బాణసంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు.బీసీ సామాజిక వర్గ నాయకుడిగా వరప్రసాద్ నియామకం పార్టీకి మరింత బలాన్ని చేకూరుస్తుందని నాయకులు ఈ సందర్భంగా ఆకాంక్షించారు. ఈ సందర్భంగా సతుపటి వెంకటపతి మరియు గంగాధర్ రెడ్డి మాట్లాడుతూ వల్లెపు వరప్రసాద్ గతంలో మునిసిపల్ ఛైర్మన్‌గా పట్టణ అభివృద్ధికి చేసిన కృషి మరువలేనిదని కొనియాడారు.?వరప్రసాద్ పదవిలో ఉన్నా లేకున్నా నిరంతరం సామాన్య ప్రజల సమస్యల పరిష్కారం కోసం శ్రమిస్తుంటారని ఆయన సేవలను గుర్తించి పార్టీ అధిష్టానం ఈ కీలక బాధ్యతను అప్పగించడం హర్షణీయం అని బీసీ విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఆయన నియామకం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న వెనుకబడిన వర్గాల గొంతుకగా నిలుస్తారని,పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో ఆయన అనుభవం ఎంతో ఉపయోగపడుతుందని నేతలు అభిప్రాయపడ్డారు. కష్టకాలంలో కూడా పార్టీ వెంటే ఉండి,క్రమశిక్షణ కలిగిన కార్యకర్తగా మెలిగిన వరప్రసాద్ కి తగిన గుర్తింపు లభించిందని వారు పేర్కొన్నారు. అనంతరం వల్లెపు వరప్రసాద్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించిన పార్టీ అధిష్టానానికి కృతజ్ఞతలు తెలుపుతూ,బీసీల సంక్షేమం కోసం మరియు పార్టీ బలోపేతం కోసం అంకితభావంతో పనిచేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పట్టణ కన్వీనర్ గంగాధర్ రెడ్డి,మాజీ కో-ఆప్షన్ మెంబర్) దాసరి చంద్రమౌళి, కావేటి చలపతి,?సతుపటి శివ,కావేటి గిరి,బలిజపల్లి చంద్రమోహన్ రెడ్డి,?చంద్రశేఖర్ రెడ్డి, మరియు పార్టీ కార్యకర్తలు,అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని వరప్రసాద్ కి శుభాకాంక్షలు తెలియజేశారు.

# గో సన్మాన్' కోసం తహసీల్దార్‌కు వినతి

**సింహాద్రిపురం, సూర్య వాస్తవం:** భారతీయ సంస్కృతిలో గోమాతకు విశిష్ట స్థానం ఉందని,స్వదేశీ గోవులకు జాతీయ గౌరవం కల్పించడమే లక్ష్యంగా 'గో సన్మాన్ ఆహ్వాన్ అభియాన్' కార్యక్రమాన్ని చేపట్టినట్లు నిర్వాహకులు తెలిపారు.ఏప్రిల్ 26 'గో సన్మాన్ దివాస్' పురస్కరించుకొని సింహాద్రిపురం మండల తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు.?ఈ సందర్భంగా బిజెపి కిసాన్ మోర్చా నాయకులు లక్ష్మీనారాయణ రెడ్డి, అమర్నాథ్ రెడ్డి,బిసి మోర్చా నాయకులు రామాంజనేయులు,యువ మోర్చా నాయకులు రాంప్రకాష్ తదితరులు మాట్లాడుతూ గోసంరక్షణ కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కఠినమైన చట్టాలు తీసుకురావాలని డిమాండ్ చేశారు.దేశవ్యాప్తంగా గోవధను పూర్తిగా నిషేధించాలని,గోమాతను 'జాతీయ తల్లి'గా గుర్తించి భారతీయ జాతీయ వారసత్వ గౌరవ హోదా కల్పించాలన్నారు.గోసేవ కోసం ప్రత్యేకంగా కేంద్ర మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేసి,గోసేవ చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలని,వ్యవసాయ రంగంలో గో ఆధారిత ఉత్పత్తులను ప్రోత్సహించాలని,రైతులకు సరసమైన ధరలు కల్పించాలని కోరారు.?అహింసా మార్గంలో రాజ్యాంగబద్ధంగా తమ లక్ష్యాలను సాధించుకుంటామని,ప్రతి భారతీయుడు గో సంరక్షణలో భాగస్వాములు కావాలని ఈ సందర్భంగా వారు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో పలువురు గో ప్రేమికులు,పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.



## ఆహార సాంకేతిక కళాశాలలో రాజా వాసిరెడ్డి వెంకటాద్రి నాయుడు జయంతి



**పులివెందుల - సూర్య వాస్తవం:** పులివెందుల లోని ఆహార సాంకేతిక కళాశాలలో రాజా వాసిరెడ్డి వెంకటాద్రి నాయుడు జయంతి కార్యక్రమం" సోమవారం జరిగింది. ఈ కార్యక్రమంలో కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్. ఎమ్. మాధవ, ఇతర అధ్యాపకులు, విద్యార్థులు రాజా వాసిరెడ్డి వెంకటాద్రి నాయుడు' చిత్రపటానికి పుష్ప నివాళులు అర్పించారు. కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్. ఎమ్. మాధవ మాట్లాడుతూ, రాజా వాసిరెడ్డి వెంకటాద్రి నాయుడు ఆంధ్ర ప్రదేశ్ చరిత్రలో (1783-1817) ముఖ్యంగా కృష్ణా, గుంటూరు ప్రాంతాలలో అత్యంత ప్రసిద్ధి చెందిన జమీందారు అని అన్నారు. రాజా వాసిరెడ్డి వెంకటాద్రి నాయుడు కృష్ణాతీరంలోని అమరావతిని రాజధానిగా చేసుకొని పరిపాలించారు. అమరావతిని రాజధానిని ఒక గొప్ప ఆధ్యాత్మిక సాంస్కృతిక కేంద్రంగా తీర్చిదిద్దారని తెలిపారు. ఆయన తెలుగు నాట తన పరిపాలన, సంస్కృతి, దేవాలయ నిర్మాణాలు, పునర్నిర్మాణాలు ద్వారా చిరస్థాయిగా నిలిచిపోయారు అని అన్నారు. రాజా వాసిరెడ్డి వెంకటాద్రి నాయుడు నాడు పరిపాలించిన అమరావతి రాజధానినే, ప్రస్తుత ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మన రాష్ట్ర రాజధానిగా ప్రకటించిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్. ఎమ్. మాధవ, అధ్యాపకులు డాక్టర్ రాజేష్, డాక్టర్ సాయి శ్రీనివాస్, డాక్టర్ జాకీర్ భాషా,ఎన్.వి.సుబ్బారెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

## ముగిసిన భాగవత సప్తహ పఠనం



**లింగాల సూర్య వాస్తవం:** లింగాలమండలం కామసముద్రం గ్రామంలో శ్రీరామ ఆంజనేయ స్వామి ఆలయం లో సోమవారం భాగవత సప్తహ పఠనం విజయవంతంగా ముగిసింది. వాటిలో భాగంగా ఉదయం 11 గం నుంచి12 గం లకు మంత్ర పుష్పం జరిగింది. ఆలయం లో మహిళల చే కలశ ప్రదర్శనం భక్తి శ్రద్ధల నడమ సాగింది. అనంతరం భాగవత పండితులకు ఘన సత్కారం నిర్వాహకులు నిర్వ హించారు. ఆలయ నిర్వాహకులు ఏర్పాటుచేసిన భక్తులకు అన్నదాన కార్యక్రమంనిర్వహించారు. ఏడు రోజులపాటుఅల్పాహారం మధ్యాహ్నం రాత్రి అన్నప్రసాద వితరన చేసిన గ్రామస్థులు దాతలకుపులివెందుల భాగవత భక్తసమాజం పాలకవర్గంవారుధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగవతసమాజంఅధ్యక్షులుబి.చిన్నశివారెడ్డి.ఉపాధ్యక్షులు ఎం పాపిరెడ్డి.కార్యదర్శి పిరంగనాథం.జయచంద్రారెడ్డినారాయణరెడ్డిగంగిరెడ్డి అర్చకులు రామసుబ్బారెడ్డి మీడీయఇంచార్జీయాగంటిబాలకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పరమేశ్వరునికి విశేష పూజలు

**పులివెందుల - అర్బన్ సూర్య వాస్తవం:**



పులివెందుల పట్టణంలోని గుంత బజార్ సమీపంలో ఉన్న ఎంతో పురా తనమైన ప్రసిద్ధిగాంచిన శ్రీ మిట్ట మల్లేశ్వర స్వామి ఆలయంలో సోమవారాన్ని పురస్క రించుకొని శ్రీ మిట్టమ ల్లేశ్వరుని విశేష పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో భాగంగా తెల్లవారుజామున నుం డి స్వామి వారికి ప్రధాన అర్చకులు రుద్ర, శివ స్వాముల ఆధ్వ ర్యంలో స్వామివారికి పంచా మృత అ భిషేకం, భస్మాభిషేకం, సహస్ర నామ అష్టోత్తర శతనామావళి, భీష్మాభిషేకం, లిం గా ష్టకం తదితర పూజా కైకర్యాల అనంతరం మిట్ట మల్లేశ్వరుడు ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శ నమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వహకులు మాట్లాడుతూ శివాలయం లో ప్రతిరోజు విశేష పూజలు ధూప, దీప, నైవేద్యాలు, ఘనం గా నిర్వహించడం జరు గుతోందని అన్నారు. సోమవారాన్ని పురస్కరిం చుకొని ఆలయానికి పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని పరమశివునికి ఎంతో నమ్మకంతో భక్తి శ్రద్ధలతో మొక్కలు చెల్లించి విశేష పూజలు నిర్వ హించడం జరుగుతుందన్నారు. అనంతరం అనంతరం ఆలయ నిర్వా హకులు ఏర్పాటుచేసిన తీర్థ ప్రసాదాలను భక్తులకు అంద జేశారు. ఈ కార్యక్రమంలో భక్తులు ఎండో మెంట్ సిబ్బంది ఆలయ నిర్వహకులు తదితరులు పాల్గొన్నారు.

## డీజిల్ కృతిమ కొరత సృష్టించితే కఠిన చర్యలు



**సింహాద్రిపురం - సూర్య వాస్తవం:** సింహాద్రిపురంలో డీజల్, పెట్రోల్ కృతిమ కొరత సృష్టించితే కఠిన చర్యలు తీసుకుంటామని తహసిల్దార్ అనురాధ, ఎస్సై డాక్టర్ నాయక్ పేర్కొన్నారు. సోమవారం సింహాద్రిపురం మండలంలోని పెట్రోల్ పంపులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెట్రోల్, డీజిల్ నిలువలు ఉన్నాయని డీజిల్, పెట్రోల్ పంపు నిర్వాహకులు స్టాక్ రికార్డులను ఏర్పాటు చేసుకొని వాహనదారులకు తప్పనిసరిగా డీజిల్, పెట్రోల్ పట్టించాలన్నారు. ప్రభుత్వ నిబంధనలను అతిక్రమించితే పంపు నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కొంతమంది డీజిల్ బంకు నిర్వాహకులు రాత్రి సమయాలలో మాత్రమే పట్టుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. అలా కాకుండా స్టాక్ ఉన్నట్లయితే తప్పనిసరిగా వాహనాలకు పెట్రోల్, డీజిల్ పట్టాలన్నారు .ఈ కార్యక్రమంలో ఆర్ఐ రామ గంగాధర్, వీఆర్వోలు పుష్పరాజ్, నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

# మెడికల్ కాలేజీ వద్ద గ్రీన్ ఫీల్డ్ హైవే ఎగ్జిట్ పాయింట్ ఏర్పాటు చేయాలి

### పులివెందుల టిడిపి ఇన్చార్జ్ బీటెక్ రవి



**పులివెందుల - సూర్య వాస్తవం:** అమరావతి నుండి బెంగళూరు వరకు నిర్మిస్తున్న గ్రీన్ ఫీల్డ్ హైవే పనుల గురించి బీటెక్ రవిపులివెందుల ప్రజల సౌకర్యార్థం స్థానికంగానే పులివెందుల మెడికల్ కాలేజీ వద్ద ఎగ్జిట్ పాయింట్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రీన్ ఫీల్డ్ హైవే చుట్టూ బారికేడ్లు ఉండటం వల్ల ప్రయాణికులు ఎక్కడ పడితే అక్కడ ఎక్కడానికి లేదా దిగడానికి వీలుండదని, కేవలం టోల్ గేట్ల వద్ద మాత్రమే అవకాశం ఉంటుందని ఆయన వివరించారు.పులివెందుల మెడికల్ కాలేజీ సమీపంలో ఎగ్జిట్ పాయింట్ ఏర్పాటు చేస్తే కడప, కదిరి వెళ్లే వారికిమరియుపులివెందుల వాసులకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని తెలిపారు.ఈ ప్రాంతంలో ఎగ్జిట్ పాయింట్‌తో పాటు రెస్ట్ ఏరియా, పెట్రోల్ బంక్ మరియు రెస్టారెంట్లు ఏర్పాటు చేయాలని, ఈ విషయమై కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి కూడా విన్నవిస్తామని ఆయనపేర్కొన్నారు.హైవే నిర్మాణం కోసం భూములు కోల్పోయిన రైతుల సమస్యలపై స్పందిస్తూ, సుబ్బారెడ్డి అనే రైతులిదాదాపు 12 ఎకరాల భూమిని కోల్పోయారని, ప్రభుత్వం ఇచ్చే పరిహారం ప్రస్తుత మార్కెట్ ధరతో పోలిస్తే చాలా తక్కువగా ఉందని రవి ఆవేదన వ్యక్తం చేశారు.ఈ సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి రైతులకు తగిన న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు. వంతెనల ఎత్తు తక్కువగా ఉండటం వల్ల హిటాచీ వంటి పెద్ద యంత్రాల రాకపోకలకు ఇబ్బంది కలుగుతోందన్న ఫిర్యాదులను అధికారులతో చర్చిస్తామన్నారు.అలాగే, తుమ్మలపల్లిలోని చర్చి మరియు మల్లెల లోని మసీదు వంటి మతపరమైన కట్టడాలకు ఎటువంటి నష్టం కలగకుండా అలైన్‌మెంట్ లో మార్పులు చేయాలని కోరుతున్నట్లు తెలిపారు.శ్రీకృష్ణ దేవాలయ భూముల ఆక్రమణపై వస్తున్న వార్తల గురించి మాట్లాడుతూ, ఆ ప్రచారంలో వాస్తవం లేదని ఆయన స్పష్టం చేశారు.గత ప్రభుత్వంలో జగన్ మోహన్ రెడ్డి ఆలయ అభివృద్ధి కోసం 2 కోట్ల రూపాయలు కేటాయించారని, ప్రస్తుత కూటమి ప్రభుత్వం కూడా నిధులు ఇచ్చిందని వివరించారు.ఆలయ నిర్వహణకు అయ్యే ఖర్చుల కోసం ఆదాయ వనరుగా ధ్యాన మందిరాన్ని నిర్మిస్తున్నామని,భవిష్యత్తులో ఆలయానికి ఎటువంటి ఇబ్బంది కలగకుండా ఉండేందుకే ఈ ప్రయత్నం చేస్తున్నామని ఆయన వివరణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు మార్కెట్ చైర్మన్ అమర్నాథ్ యాదవ్ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

### అగ్రోఫారెస్ట్రీ - క్లైమేట్ ప్రూఫింగ్ ఫార్మ్ లైవ్‌లీహుడ్స్ నిర్వహించిన

# రైతుల అవగాహన సమావేశం






**బత్తలపల్లి - సూర్య వాస్తవం:** బత్తలపల్లిలోని ఆర్‌కే ఫంక్షన్ హాల్‌లో శ్రేట్రీస్ సహకారంతో హ్యాండ్స్ సంస్థ నిర్వహించిన ఈ సమావేశం వాతావరణ మార్పులను తట్టుకుంటూ సుస్థిర వ్యవసాయం ద్వారా రైతుల జీవనోపాధిని మెరుగుపరచడమే ఈ కార్యక్రమం యొక్క ప్రధాన ఉద్దేశ్యం. ఈ కార్యక్రమం లో 6 మండలాలకు చెందిన 31 గ్రామాల నుండి సుమారు 105 మంది రైతులు. హాజరయ్యారు. రిటైర్డ్ ఫారెస్ట్ ఆఫీసర్ వెంకట నారాయణ, రీజినల్ మేనేజర్ మనోహర్ ప్రోగ్రాం డైరెక్టర్ నారాయణ స్వామి మరియు పలువురు అధికారులు మాట్లాడారు. రిటైర్డ్ ఫారెస్ట్ ఆఫీసర్ వెంకట నారాయణ, మాట్లాడుతూ రైతులు ఎంతో కష్ట కాలంలో ఉన్నారు. ఈలాంటి సమయంలో శ్రేట్రీస్ సహకారంతో హ్యాండ్స్ సంస్థ ఈ ప్రాంతంలో రైతులకు అండగా వుండి అవగాహన కల్పించడం చాలా సంతోషకరం. రైతులు ఈ అవకాశాన్ని చేసుకోవాలని కోరుకుంటున్నాను. ఈ కార్యక్ర మం నిర్వహించిన " శ్రేట్రీస్ హ్యాండ్స్ సంస్థకు ఇక్కడికి వచ్చిన రైతులకు ధన్యవాదాలు. శ్రేట్రీస్ రీజినల్ మేనేజర్ మనోహర్ మాట్లాడుతూ ఈ ప్రాంతంలో ఇప్పటివరకు 1.3 లక్షల మొక్కల పంపిణీ పూర్తి చేసాము. వచ్చే ఏడాది మరో 1 లక్ష మొక్కలను పంపిణీ చేయాలని నిర్ణయంచుకున్నాము. అలాగే ప్రస్తుత వేసవి కాలంలో నీటి కొరతతో ఇబ్బందులు పడుతున్న రైతులను దృష్టిలో ఉంచుకుని వారికి అండగా ఉంటాము. అన్నారు. ఈ సమావేశంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు నిర్వాహకులకు వివరించారు. ఎండాకాలం అవడం వలన చాలా వరకు బోర్లు ఎండిపోయాయని ఈ పరిస్థితిలో పండ్లచెట్లను కాపాడుకోవడానికి రక్షక తడులు అందించాలని రైతులు నిర్వాహకులుకు విన్నవించుకున్నారు. ప్రోగ్రాం డైరెక్టర్ నారాయణ స్వామి మాట్లాడుతూ ఎండకాలం దృష్ట్యా నీటి కొరత ఉన్న రైతులకు నీటి సౌకర్యం కల్పించడం. చనిపోయిన మొక్కల స్థానంలో కొత్త మొక్కలను నాటడం. సేంద్రీయ ఎరువుల తయారీకి అవసరమైన ముడి పదార్థాలను అందించడం. అయితే, వీటిని రైతులు పొలాల్లో మాత్రమే వినియోగించాలని, దుర్వినియోగం చేయవద్దని సూచించారు. మీ సమస్యలని రీజినల్ మేనేజర్ మనోహర్ తో చర్చించి రైతులకు అన్ని విధాలుగా తోడుగా ఉంటామని మాట ఇచ్చారు.?సమావేశంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు నిర్వాహకులకు వివరించారు. ఎండాకాలం అవడం వలన చాలా వరకు బోర్లు ఎండిపోయాయని ఈ పరిస్థితిలో పండ్లచెట్లను కాపాడుకోవడానికి రక్షక తడులు అందించాలని రైతులు నిర్వాహకులుకు విన్నవించుకున్నారు. ప్రోగ్రాం డైరెక్టర్ నారాయణస్వామి మాట్లాడుతూ ఎండకాలం దృష్ట్యా నీటి కొరత ఉన్న రైతులకు నీటి సౌకర్యం కల్పించడం. చనిపోయిన మొక్కల స్థానంలో కొత్త మొక్కలను నాటడం. సేంద్రీయ ఎరువుల తయారీకి అవసరమైన ముడి పదార్థాలను అందించడం. అయితే, వీటిని రైతులు పొలాల్లో మాత్రమే వినియోగించాలని, దుర్వినియోగం చేయవద్దని సూచించారు. మీ సమస్యలని రీజినల్ మేనేజర్ మనోహర్ తో చర్చించి రైతులకు అన్ని విధాలుగా తోడుగా ఉంటామని మాట ఇచ్చారు.ఈ సమావేశానికి రిటైర్డ్ ఫారెస్ట్ ఆఫీసర్ వెంకట నారాయణ, ప్రోగ్రాం డైరెక్టర్ నారాయణ స్వామి, రీజినల్ మేనేజర్ మనోహర్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ మల్లికార్జున,( బత్తలపల్లి ) ప్రోగ్రాం మేనేజర్స్ పీరావళి, కేశవ్, సాయిల్ ల్యాబ్ మేనేజర్ వైష్ణవి, టెక్నికల్ అసోసియేట్ సాయి చరణ్ ప్రోగ్రాం కోఆర్డినేటర్స్ శివ శంకర్,నాగలక్ష్మి, అకౌంటెంట్ భాగ్య మరియు ఎఫ్ సి స్ ఏ విజయ్, కిరణ్, హరి, లావణ్య, వీరనారాయణ స్వామి. ఈ సమావేశానికి హాజరయ్యారు.

# పెన్నానదిలో అక్రమంగా ఇసుకను తరలిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి

### సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు డి చిన్నప్ప యాదవ్



**శింగనమల - సూర్య వాస్తవం:** భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ ఆధ్వర్యంలో సింగనమల మండల తాసిల్దార్ కార్యాలయం దగ్గర నిరసన కార్యక్రమము చేసి అనంతరం తాసిల్దార్ శేషారెడ్డి కి వినతిపత్రం ఇవ్వడం జరిగింది.ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు డి చిన్నప్ప యాదవ్ మాట్లాడుతూ, సింగనమల మండల కేంద్రంతో పాటు చాలా గ్రామాలలో త్రాగునీటి ఎద్దడి ఏర్పడింది దానివల్ల చాలామంది ఇబ్బంది పడుతున్న పట్టించుకోని నాతులే లేరు మరియు పెన్నా నది తో పాటు వాగులు వంకలు ఇష్టానుసారంగా జెసిబి హిటాచిలుతో టిప్పర్లు ట్రాక్టర్ల ద్వారా ఇసుక అక్రమార్జనే ధ్యేయంగా సరిహద్దులు చెరిపి అక్రమాలు జరుగుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవడంలో ప్రభుత్వ అధికారులు తీరు నిమ్మకు నీరెత్తినట్టుంది. ఒకచోట పర్మిషన్ ఉంటే ఇంకోచోట పరిమితికి మించి లోతుగా తోలుతూ భూగర్భ జలాలు, బావులు ఎండిపోయి పంటలు నిట్ట నిలువుగా ఎండి పోతున్న కానీ హార్టికల్చర్ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించిన పాపన పోలేదు ఇప్పటికైనా అధికారులు దృష్టి సారించాలి అని భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ ద్వారా డిమాండ్ చేస్తున్నట్లు ఆయన తెలిపారు. గ్రామాల్లో త్రాగునీటి సమస్యను జలసిరి ద్వారా బోర్లు ఉచితంగా వేయాలి, డీజిల్ పెట్రోల్ ధరలు కొరతను తక్షణమే పరిష్కారం చేయాలి, ఉపాధి హామీ పథకములో అవినీతిని అరికట్టి ఉపాధి బిల్లులను తక్షణమే కూలీలకు అందించాలి అని భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ ద్వారా డిమాండ్ చేస్తున్నాం అని చిన్నప్ప యాదవ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి మధు యాదవ్, రైతు సంఘం మండల కార్యదర్శి బయన్న, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి మునుస్వామి, మరియు సిపిఐ నాయకులు నారప్ప, రామ సుబ్బారెడ్డి, రూప్ల నాయక్, జయరాం నాయక్, చెన్నప్ప, అజయ్, బాలిరెడ్డి,లక్ష్మయ్య రాజప్ప తదితరులు పాల్గొన్నారు,